


# గౌతమ్ న్యూస్

తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 185, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, ఆదివారం - 11- ఆగష్టు - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## గాజాలో ఇజ్రాయెల్ దాడి.. 100 మందికి పైగా మృతి!

హమాస్, హెజ్‌బొల్లాల కీలక నేతల హత్యల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడులు జరిగే ప్రమాదం పొంచి ఉండటంతో.. పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్రంగా మారాయి.



హమాస్, హెజ్‌బొల్లాల కీలక నేతల హత్యల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడులు జరిగే ప్రమాదం పొంచి ఉండటంతో..పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్రంగా మారాయి. ఈ సమయంలో కూడా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మిగతా..2లో

## బ్రెజిల్‌లో కుప్పకూలిన విమానం

బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 62 మంది దుర్మరణం చెందారు.




బ్రెసిలియా: బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 62 మంది దుర్మరణం చెందారు. వోపాస్ లిన్హాస్ ఏరియాస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం పరన రాష్ట్రంలోని కాస్కవెల్ నుంచి సావో పౌలోలోని గువారుల్హోస్ వెళ్తున్నది. ఈ క్రమంలో విన్హెడో పట్టణంలో విమానం కుప్పకూలిపోయింది. విమానంలో 58 మంది ప్రయాణికులతోపాటు నలుగురు సిబ్బంది ఉన్నారని.. అంతా మరణించారని అధికారులు వెల్లడించారు. విమానం ఓ ఇంటిపై కూలిపోయిందని,

## తెలంగాణకు కొత్త రైలు మార్గం మోడీ సంకల్పానికి సాక్ష్యం



- తెలంగాణ మీదుగా కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.
- ఈ నిర్ణయం రైల్వే నెట్ వర్క్ ను పటిష్టం చేసే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పానికి సాక్ష్యం అన్నారు.

తెలంగాణ మీదుగా కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.ఈ నిర్ణయం రైల్వే నెట్ వర్క్ ను పటిష్టం చేసే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పానికి సాక్ష్యం అన్నారు. దేశంలోని వివిధ మిగతా..2లో

# హైదరాబాద్‌లో జోయిటిస్ విస్తరణ

- ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జోయిటిస్ హైదరాబాద్‌లో తమ కేపబులిటీ సెంటర్‌ను విస్తరించాలని నిర్ణయించింది.
- అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్?బాబు, అధికారుల బృందంతో ఆ కంపెనీ ప్రతినిధులు తాజాగా సమావేశమయ్యారు.
- ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి కార్యకలాపాలను ప్రారంభించేందుకు సంస్థ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు.




హైదరాబాద్, : ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జోయిటిస్ హైదరాబాద్‌లో తమ కేపబులిటీ సెంటర్‌ను విస్తరించాలని నిర్ణయించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్?బాబు, అధికారుల బృందంతో ఆ కంపెనీ ప్రతినిధులు తాజాగా సమావేశమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి కార్యకలాపాలను ప్రారంభించేందుకు సంస్థ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జోయిటిస్ ఇండియా కేపబులిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి మిగతా..2లో

## వారం రోజుల్లో రూ.2లక్షల వరకూ రైతు రుణమాఫీ చేస్తాం



- వారం రోజుల్లో రూ.2లక్షల వరకూ రైతు రుణమాఫీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.
- దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణ మాఫీ చేసి రైతులకు అండగా నిలిచారని మంత్రి కొనియాడారు.

సిద్దిపేట: వారం రోజుల్లో రూ.2లక్షల వరకూ రైతు రుణమాఫీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణ మాఫీ చేసి రైతులకు మిగతా..2లో

## తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు.. క్లారిటీ ఇచ్చిన కిషన్ రెడ్డి




- తెలంగాణ కేంద్రం మూడు లక్షల ఇళ్లు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.
- ప్రధాని మోడీ పిలుపులో భాగంగా శనివారం ఢిల్లీలో కిషన్ రెడ్డి మొక్క నాటారు.

తెలంగాణ కేంద్రం మూడు లక్షల ఇళ్లు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని మోడీ పిలుపులో భాగంగా శనివారం ఢిల్లీలో కిషన్ రెడ్డి మొక్క నాటారు.అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నాటి కేబినెట్ భేటీలో ఇళ్ల మంజూరుపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రాజకీయ

## జల విద్యుత్ ప్రాజెక్టుల్లో గరిష్ట విద్యుత్ ఉత్పత్తికి సకల చర్యలు

- థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 17 రోజుల ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.
- అన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వారానికి ఒకసారి నివేదిక పంపాలని.. చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.

కృష్ణ, గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షపాతాలను దృష్టిలో పెట్టుకొని జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట ఉత్పత్తిని సాధించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని హైడల్ ప్రాజెక్టుల సీఈలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.



హైదరాబాద్: థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 17 రోజుల ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. అన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వారానికి ఒకసారి నివేదిక పంపాలని.. చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. కృష్ణ, గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షపాతాలను దృష్టిలో పెట్టుకొని జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట ఉత్పత్తిని సాధించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని హైడల్ ప్రాజెక్టుల సీఈలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం ఆయన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో థర్మల్, హైడల్ విద్యుత్తు ఉత్పాదనకు సంబంధించిన ఆ శాఖల సీఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి ప్లాంట్ లో కనీసం 17 రోజుల విద్యుత్ ఉత్పాదనకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మనమంతా నిబద్ధతతో, మనసుపెట్టి పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యానికి, అలసత్వానికి, ఆలస్యానికి తావు లేదని తెలిపారు. విద్యుత్ శాఖలో పని చేయడం అంటే ప్రజల కోసం నిరంతరం పనిచేయడమని అన్నారు. విద్యుత్ శాఖ అంటేనే 24/7 పనిచేసే అత్యవసర శాఖ అని అధికారులు, సిబ్బంది గుర్తుపెట్టుకోవాలన్నారు. సమాజానికి వెలుగులు ఇచ్చే శాఖలో పనిచేస్తున్నామని పూర్తిగా సేవా దృక్పథంతో కూడిన బాధ్యతల్లో ఉన్నామని సిబ్బంది గుర్తించాలని తెలిపారు. ఎవరికైనా సమస్యలు ఉంటే వినేందుకు, మిగతా..2లో

## సుంకిశాల’ నష్టాన్ని కాంట్రాక్టరే భరిస్తాడు

రిటైనింగ్ వాల్ కూలడం దురదృష్టకరం

గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ఈ పరిస్థితికి కారణం

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్/పెద్దవూర: జంటనగరాలకు తాగునీరు అందించేందుకు సుంకిశాల వద్ద చేపడుతున్న ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన సంఘటన చిన్నదని, నష్టం తక్కువైనా చాలా దురదృష్టకరమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. పనులు పూర్తి కావడానికి రెండు నెలలు ఆలస్యమవుతుందని, ఎంతటి నష్టమైనా కాంట్రాక్టరే భరిస్తాడని, ప్రభుత్వానికి ఏమీ నష్టం లేదని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టును కాంట్రాక్టర్ పూర్తి చేసి ప్రభుత్వానికి

మిగతా..2లో

## ప్రధాని మోదీకి ‘థ్యాంక్స్’ చెప్పిన రాహుల్ గాంధీ




- వయనాడ్‌లో ప్రధాని మోదీ పర్యటన
- ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలిపిన రాహుల్
- వయనాడ్ విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా ప్రకటిస్తారని ఆశాభావం

వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిన ప్రాంతంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించడంపై లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. వయనాడ్ పరిస్థితిని సమీక్షిస్తున్నందుకు ప్రధానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ పర్యటించడం మంచి నిర్ణయమన్నారు. ఇక్కడి పరిస్థితిని ఆయన ప్రత్యక్షంగా చూడటం ద్వారా దీనిని జాతీయ

## ఆలస్యమైనా నిజాయితీ, సత్యమే గెలిచాయి

ఆలస్యంగానైనా నిజాయితీ, సత్యమే గెలిచాయని ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అన్నారు.



ఆలస్యంగానైనా నిజాయితీ, సత్యమే గెలిచాయని ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టయ్యి 570 రోజులకుపైగా జైల్లో ఉన్న మనీశ్‌సిసోడియాకు బెయిల్ లభించడంతో.. శుక్రవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఇవాళ ఉదయాన్నే కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మిగతా..2లో

## కుక్కలదాడి ఘటనలపై హరీశ్‌రావు కీలక ట్వీట్



రాష్ట్రంలో వరుసగా కుక్కల దాడి ఘటనలు జరిగినా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.

హైదరాబాద్: రాష్ట్రంలో వరుసగా కుక్కల దాడి ఘటనలు జరిగినా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం(ఆగస్టు 10) ఎక్స్(ట్విటర్)లో ఆయన ఒక పోస్టు చేశారు. మిగతా..2లో

## వయనాడ్ లో ప్రధాని నరేంద్ర మోడీ ఏరియల్ సర్వే

- కన్నూర్ విమానాశ్రయంలో ప్రధానికి సీఎం, గవర్నర్ స్వాగతం
- వైమానిక దళ హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించిన ప్రధాని
- రోడ్డు మార్గంలో కొండచరియలు విరిగిన ప్రాంతానికి బయల్దేరిన ప్రధాని



ప్రకృతి విపత్తు కారణంగా అతలాకుతలం అయిన కేరళలోని వయనాడ్ లో ఇవాళ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటిస్తున్నారు. కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ముండక్కై, చురాల్ మల తదితర ప్రాంతాల్లో మోడీ శనివారం ఎయిరియల్ సర్వే నిర్వహించారు.ఇవాళ ఉదయం 11 గంటలకు కన్నూర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కు చేరుకున్న మోడీకి అక్కడ కేరళ గేవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, సీఎం పినరయి విజయన్ స్వాగతం పలికారు. అనంతంరం వీరుతో పాటు కేంద్ర మంత్రి సురేశ్ గోపీతో కలిసి ప్రధాని ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ లో వయనాడ్ వెళ్లారు. అక్కడ కొండచరియలు విరిగిపడిన గ్రామాలు విధ్వంసమైన ప్రాంతంలో పీఎం మోడీ ఏరియల్ సర్వే చేశారు. అనంతరం కాల్ పెట్టలో హెలికాప్టర్ దిగిన తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ టీమ్‌తో మాట్లాడి వివరాలు తెలుసు కోనున్నారు. అలాగే సహాయక శిబిరాలు, ఆసుపత్రులకు వెళ్లి మిగతా..2లో

## జాతీయ నంది అవార్డు పొందిన గనవేని మల్లేష్ యాదవ్ ని ఘనంగా సన్మానించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): జాతీయ నంది అవార్డు పొందిన గనవేని మల్లేష్ యాదవ్ హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో శనివారం శాలువా సత్కరించి ఘనంగా సన్మానించి అభినందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ సందర్భంగా మాజీ మంత్రి బీ.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో సామజిక సేవలు అందించి యువకులకు స్పూర్తి గా నిలుస్తూ,చిన్న వయసులోనే జాతీయ నంది అవార్డు అందుకోవడం హర్షనీయమని అన్నారు.. ఇక ముందు కూడా అవసరమైన వారికి సాధ్యమైన సేవలు అందిస్తూ ముందుకు సాగాలని సూచించారు... అభినందనలు శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించిన కెటిఆర్ కి మల్లేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు..

## మొదటి దఫా దోమల మందు పిచికారీ చేపించిన హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్





ఏటూరునాగారం(కన్నాయిగూడెం) (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: కన్నాయిగూడెం మండలం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కన్నాయిగూడెం గ్రామంలో శనివారం రోజున ఇంటింటికి మొదటి దఫా దోమల మందు పిచికారీ చేపించారు. గడిచిన పదిహేను రోజుల నుండి ఏడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మురికి నీటి కాలువలు నిండి ఇళ్లలోకి భారీగా దోమల చేరడంతో వాటి వలన డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా జ్వరాలు వస్తున్నందున ముందస్తు జాగ్రత్తగా దోమల మందు పిచికారీ చెపిస్తున్నట్లు హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ అన్నారు.అలాగే ఇంటి చుట్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వేడి ఆహార పదార్థాలనుతీసుకోవాలని,కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచన చేశారు. దోమల నివారణ లేక జ్వరాలు వస్తున్న క్రమంలో దోమల మందు పిచికారీ చూపించిన డాక్టర్ అభినవ్,హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ మీద గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## రెండవ రోజు పెద్దాపూర్ హాస్టల్ పర్యటించిన కలెక్టర్





మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల పెద్దాపూర్ (హాస్టల్) రెండవ రోజు పర్యటించి పారిశుధ్య పనులను జెసిబి డోజర్ ద్వారా చేసే పనులను పరిశీలించినారు కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులను త్వరగా పూర్తిచేయాలని రెండు నూతి బొందలను కుడుపాలని పెద్ద పెద్ద బండరాలను కూడా తొలగించాలని అధికారులను ఆదేశించినారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ.ముజీబ్ .అశోక్. నిజాం.ఆసిఫ్. పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు


## నూతనంగా నిర్మిస్తున్న జనరల్ మేనేజర్ కార్యాలయం పనులను పర్యవేక్షించిన

### కొత్తగూడెం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎం. షాలెంరాజు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు నూతనంగా త్రీ ఇంక్లైన్, రెస్క్యూ స్టేషన్ వద్ద నిర్మిస్తున్నటు వంటి జనరల్ మేనేజర్ కార్యాలయం, ఏరియా వర్క్ షాప్ లలో జరుగుచున్న సివిల్ పనులను సంబంధిత అధికారులతో పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం షాలెం రాజు మాట్లాడుతూ సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు సలహాలను ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిఎం షాలెం రాజు తో పాటు ఎస్.ఓ.టు జిఎం జీవి.కోటిరెడ్డి, ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, అధికారులు టి. శ్రీకాంత్, అనిల్, శంకర్, ఎం. మురళి, కే శేషశ్రీ, వి.శ్రీనివాసరావు, సివిల్ సూపర్వైజర్ మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితుల కోసం సేకరించిన మొత్తాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కి అందించిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారది



(గౌతమ్ న్యూస్): కేరళ వాయినాడ్ వరద బాధితుల కోసం సేకరించిన మొత్తాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కి అందించిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారది భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కేరళ వాయినాడ్ వరద బాధితుల కోసం మహబూబాద్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన మొత్తాన్ని శనివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనందిని సాంబశివరావు కి జిల్లా పార్టీ తరఫున అందించిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి. కేరళ వయనాడు వరద బాధితుల కోసం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లాలోని మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో మరియు గార్ల మండల కేంద్రంలో రెండు రోజులపాటు చేసినటువంటి మొత్తాన్ని సిపిఐ జిల్లా పార్టీ తరఫున జిల్లా కార్యదర్శి బి.విజయ సారధి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూననేని సాంబశివరావు కి అందించడం జరిగింది. ఈ సందర్భంగా బి.విజయ సారథి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరూ కేరళ వయనాడు వరద బాధితులను ఆదుకోవాలని, పార్టీ శ్రేణులు ఇంకా ఆయా మండల కేంద్రాల్లో వరద బాధితుల సహాయార్థం నిధి సేకరణ చేయాలని, వరద బాధితుల కోసం అన్ని వర్గాల ప్రజలు వ్యాపారస్తులు ఉద్యోగస్తులు అందరూ వారికి తోచినంత సహాయ సహకార అందించి ఆపదలో ఉన్న వయనాడు ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికురాలు ఓదెమ్మ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం

### తక్షణ పరిహారంతోపాటు కుటుంబలో ఒకరికి ఉద్యోగం. ఓదమ్మకు సంతాపం తెలిపిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : అవగాహన లోపంతో దోమల మందుతాగి మృత్యువాతపడిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు బత్తుల ఓదెమ్మ (50) కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని, ఇలాంటి సంఘటనలు జరగకుండా మున్సిపల్ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసికోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. హైద్రాబాద్లో ఉన్న కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఓదెమ్మ మృతివార్త తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు, ఓదెమ్మ మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మహిళా కార్మికురాలు మృతి చెందడం బాధాకరమని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణ సహాయంగా మున్సిపల్ నిధుల నుంచి రూ.3 లక్షల పరిహారంతోపాటు, కర్మకాండలు రూ.10వేలు వెంటనే అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కుటుంబలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఇప్పటికే సంబందిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఓదెమ్మ కుటుంబానికి అదనపు ఆర్థిక సహాయంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇంటి మంజూరు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేలా ఒప్పిస్తానన్ని తెలిపారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవలసిన భాద్యత మున్సిపల్ అధికారులపై ఉందని, కార్మికులకు విధి నిర్వహణలో కావాల్సిన త్రాగునీరు, రక్షణ పరికరాలు సమకూర్చాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం సిపిఐ మున్సిపల్ పక్ష కౌన్సిలర్లు, మహిళా సమాఖ్య నాయకురాళ్లు మృతదేహాన్ని ఓదెమ్మ స్వగృహం 3 ఇంక్లైన్ ఏరియాకు తరలించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ స్వామి, చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ధర్మారావు, యూసఫ్, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, కె.రత్నకుమారి, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు బరిగెల భూపేష్, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షమీమ్ , బత్తుల సమ్మయ్య,కాంగ్రెస్ నాయకులు కనకరాజు, మొయినుద్దీన్, తదితరులు ఓదెమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళు లర్పించారు.

## సింగరేణి వ్యాప్తంగా సేఫ్టీ, మైన్స్ కమిటీల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన

### సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): సింగరేణి భవన్ : సింగరేణి సీఎండీ బలరాం నాయక్ సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియా ల సేఫ్టీ కమిటి మరియు మైన్స్ కమిటీలతో హైదరాబాద్ లోని సింగరేణి భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సేఫ్టీ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఆ యొక్క సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఏరియా లోని సింగరేణి పీ వీ కే గని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ పిట్ కార్యదర్శి హుమాయూన్ పాల్గొని సేఫ్టీ మీద కొన్ని సూచనలు ఇవ్వడం జరిగింది. అనునిత్యం ఎస్ఎంపి మరియు ఎస్ఓపి ల గురించి కార్మికులకు వివరించడం జరుగుతున్నప్పటికీ ప్రమాదాలు అరికట్టలేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి అన్నారు. ఇట్టి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి కార్మికుడు చిత్తశుద్ధి పని చేస్తూ పని చేసే క్రమంలో ఒక్క నిమిషం ఆ పని గురించి అలోచించి అవగాహన తో పనిచేస్తే ప్రమాదాలు అరికట్టవచ్చు అన్నారు.గతంలో ఒక ఓవర్మెన్ కావాలి అంటే ఆ కార్మికుడి కి ఒక పద్దెనిమిది నెలలు కోల్ కటింగ్ , ఆరు నెలలు టింబరింగ్, ఆరు నెలలు డి పిల్లరింగ్ తప్పనిసరిగా చేసి అనుభవం సంపాధిస్తేనే ఓవర్మేన్ గా పదోన్నతి లభించేది అలా స్వయంగా అనుభవం ఉన్న ఓవర్మేన్ వృత్తిలో నైపుణ్యత ప్రదర్శిస్తూ ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసేవాడని ప్రస్తుతం సంపూర్ణ అవగాహన లేని కారణంగా వల్ల కూడా ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుంది మనం దీనిని కొంతవరకు సమీక్షించుకుంటూ ముందుకువెళితే ప్రమాదాలను నివారించుకోవచ్చు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కె.వి.రమణమూర్తి, సముద్రాల సుధాకర్,అధికారులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లను గుర్తించండి!!


### గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం సోషల్ మీడియా కీలకపాత్ర!! సోషల్ మీడియా కన్వీనర్ డి, వెంకటేష్ విజ్ఞప్తి!!




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ప్రధానంగా సోషల్ మీడియా కన్వీనర్ల పాత్ర కీలకమని చెప్పవచ్చు ఇందులో భాగంగా తెలంగాణలోని 119 నియోజకవర్గాలలో సోషల్ మీడియా కన్వీనర్లు కంటిమీద కునుకు లేకుండా పనిచేశారని



ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి అప్పట్లో సోషల్ మీడియా కన్వీనర్ లను ఆదుకుంటామని వాళ్లకు తగిన బాధ్యతలు అప్పజెప్పుతామని ఇచ్చిన హామీని అమలు అమలు చేసి న్యాయం చేయాలని వనపర్తి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ద్యారపోగు వెంకటేష్ విజ్ఞప్తి చేశారు, వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ధ్యారపోగు వెంకటేష్ తో పాటు ఇప్పటికే కూడా తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో సోషల్ మీడియాలో పనిచేస్తున్న కన్వీనర్లు కాంగ్రెస్ పార్టీకి వెండు దండుగా నిలిచిన విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు గుర్తిస్తున్నారని, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో సోషల్ మీడియా కన్వీనర్ల పాత్రను పార్టీ తక్షణమే గుర్తించి కార్పొరేషన్ చైర్మన్ పదవులు, నామినేట్ పోస్టులు భర్తీ చేస్తి అందులో అవకాశం ఇవ్వాలని వెంకటేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి తో పాటు ఇతర శాఖలో ఉన్న కార్పొరేషన్ పదవుల్లో అవకాశం ఆయన ప్రభుత్వాన్ని కోరారు, ద్యారపోగు వెంకటేష్ గతంలో 21 వ వార్డు అధ్యక్షునిగా వనపర్తి పట్టణ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించడం జరిగింది, డి, వెంకటేష్ గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా పని చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన సూచనలు మేరకు తూచా తప్పకుండా పాటిస్తూ తనకిచ్చిన పదవి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి కరుడుగట్టిన నాయకుడిగా పని చేసుకుంటూ సోషల్ మీడియా ద్వారా ఫేస్బుక్ వాట్సప్ ట్విట్టర్ ద్వారా కాంగ్రెస్ పార్టీ సమాచారాలను పత్రికా ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు చేరవేస్తూ కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీ నాయకులకు విధేయుడుగా పని చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సోషల్ మీడియా ద్వారా తనకంటూ ఒక పేరు సంపాదించుకున్న నాయకుడు ద్యారపోగు వెంకటేష్ కావున కాంగ్రెస్ పార్టీ వెంకటేష్ కష్టాన్ని గుర్తించి నామినేట్ పదవులలో అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు,వనపర్తి శాసనసభ్యుడిగా వనపర్తి శాసనసభ్యుడు మేఘా రెడ్డి ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ఎవరికీ ఆపద వచ్చినా కూడా నేను



ఉన్నానని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఏ సమస్య వచ్చినా కూడా స్పందిస్తూ తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి భరోసా ఇస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు, ఇప్పటికే అనారోగ్యంతో మరణించిన కుటుంబాలను, ప్రమాదాలతో మరణించిన కుటుంబాలను, వనపర్తి ఎమ్మెల్యే తన సొంతంగా ఆర్థిక సాయం చేసి ఆదుకున్న ఘనత మేఘారెడ్డి దక్కిందని అని అన్నారు,, రాబోయే రోజులో తనతోపాటు సోషల్ మీడియా కన్వీనర్లను కూడా



గుర్తించక తప్పదని తప్పకుండా ఎమ్మెల్యే పైన నమ్మకం ఉందని సోషల్ మీడియా డి,వెంకటేష్ అన్నారు, ప్రతి ఒక్కరికి న్యాయం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం ధ్యేయం అన్నారు, ఇప్పటికే రాష్ట్రంలో రైతు రుణమాఫీతో పాటు, రైతు భరోసా నిధులను విడుదల చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉచిత ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని ఆయన సందర్భంగా అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు 10 లక్షలు ఆరోగ్య బీమా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల రైతు రుణమాఫీ , కాంగ్రెస్ పార్టీ చేయడం జరిగిందని ఆయన అన్నారు,వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి వనపర్తి నియోజకవర్గం లో ఏ సమస్య ఉన్న ఆ సమస్యను తక్షణమే పరిష్కారం చేయడం జరుగుతుంది అలాంటి నాయకుడు వనపర్తి ఎమ్మెల్యేగా మేఘా రెడ్డి ని గెలిపించుకున్నందుకు ప్రజలు ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు, నిరంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకునే నాయకుడు ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ప్రజాభవన్ లో ప్రజల సమస్యలను స్వయంగా ఎమ్మెల్యే దగ్గర కలవడానికి ప్రజల సమస్యలు చెప్పుకోవడానికి క్యాంప్ ఆఫీసులో ఆ సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తూ ప్రజల మధ్య ఉంటున్న ఏకైక నాయకునిగా గుర్తింపు ఉందన్న సంగతి ఇప్పటికే వనపర్తి నియోజకవర్గం లోనే కాక ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాల్లో రాష్ట్రంలో కూడా వనపర్తి ఎమ్మెల్యే కు ప్రత్యేకత ఉందని ఆయన అన్నారు, తక్కువ కాలంలోనే ప్రజలతోన ఎక్కువ పేరు సంపాదించుకున్న ఏకైక నాయకుడు మేఘారెడ్డి ఏ సమయంలో కార్యకర్తకు ఆపద వచ్చిన నేనున్నానని అండగా నిలిచిన నాయకుడు మేఘా రెడ్డి అలాంటి గొప్ప నాయకుడు వనపర్తి లో ఉండడం ప్రజలు చేసుకున్న పుణ్యం కావున కచ్చితంగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడే కార్యకర్తను గుర్తించడం ఆదుకోవడం లోకాంగ్రెస్ పార్టీ లక్ష్యం ముందంజలో ఉందని డి ,వెంకటేష్ అన్నారు, వనపర్తి లో అభివృద్ధి విషయంలో కార్యకర్తల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఎలాంటి సమస్య వచ్చినా ఎవ్వరు కూడా చింతించాల్సిన అవసరం లేదని ఆయన సందర్భంగా పేర్కొన్నారు, చివరిగా సాధ్యమైనంత తొందరలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు నాయకులను గుర్తించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఇందులో భాగంగా పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డాం తమను గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు,

# ఓదెమ్మ కుటుంబానికి సిపిఐ ఏఐటీయూసీ అండగా ఉంటుంది

**విధినిర్వహణలో ఉన్న కార్మికులను నిత్యం పర్యవేక్షించాలి.**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఓదెమ్మ కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని, పూర్తిస్థాయిలో న్యాయం జరిగేవరకు తమ కృషి కొనసాగుతుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. అవగాహనలోపంతో బత్తుల ఓదెమ్మ అనే కొత్తగూడెం మున్సిపాలిటీ కార్మికురాలు మృతిచెందంపై అయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు, ఓదెమ్మ మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కార్మికులకు ఏ కష్టం వచ్చినా సిపిఐ, ఏఐటీయూసీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మృతివార్త తెలుసుకున్న వెంటనే స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై హెచ్చరించడం జరిగిందని, తక్షణమే మున్సిపల్ శాఖ నిధుల నుంచి పరిహారం చెల్లించాలని ఆదేశించారని తెలిపారు. వారికి ప్రభుత్వం నుంచి అదనపు పరిహారంతోపాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇచ్చేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. విధుల్లో వున్న కార్మికులను మున్సిపల్ శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు.



# వికలాంగులకు ఉచిత వీల్ చైర్ల పంపిణీ చేసిన

**ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి**



మానుకోట జిల్లా ప్రతినిది(గౌతమ్ న్యూస్): శనివారం మహబూబాబాద్ పట్టణంలోని 24వ వార్డులోని లెనిన్ నగర్ కవనెంట్ చర్చ్ వద్ద ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్ (ఇసీఎం)వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగులకు ఉచిత వీల్ చైర్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని వీల్ చైర్లను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న. ఈ కార్యక్రమంలో ఇసీఎం జిల్లా అధ్యక్షులు సేవ్య, సెక్రటరీ గణేష్, మార్నేని కిరణ్, ఏలీయా, అబ్రహం, కవనెంట్ చర్చ్ ఫాదర్ పౌల్, మోషయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి..

**రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...**

**తొర్రూర్ డి ఈ మధుసూదన్.**



మరిపెడ (గౌతమ్ న్యూస్): మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామం లొ రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మోటర్లు కాలిపోకుండా ఉండేందుకు మోటార్లకు కెపాసిటర్ లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ తొర్రూర్ డిఈ మధుసూదన్ సూచించారు. సీఎం డి ఆదేశాల మేరకు శనివారం మరిపెడ మండలంలోని చిల్లం చెర్ల గ్రామంలో విద్యుత్ శాఖ పొలంబాట కార్యక్రమంలో మరిపెడ సబ్ డివిజన్ ఏడిఈ లోక్ నాద్ రెడ్డి తో కలసి డి ఈ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డి ఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా లో తరుచూ హెచ్చుతగ్గులు అవుతుంటాయి. రైతులు కెపాసిటర్ లు అమర్చక పోవడం తో మోటార్లు తో పాటు ట్రాన్స్ఫార్మర్స్ పై అధిక భారం పడి కాలిపోతుంటాయన్నారు. అందుకు రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు స్టార్టర్లకు ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పంట పొలాలల్లో విద్యుత్ స్తంభల మధ్య లూజ్ లైన్లు, వంగిన విద్యుత్ పోల్స్ లేకుండా పొలం బాట కార్యక్రమంలో సరిచేయనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలన్నారు.సీఎం డి ఆదేశాల మేరకు మరిపెడ,ఎల్లంపేట,చిన్నగూడూరు సెక్షన్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమంను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట ఏఈ అజయ్,సబ్ ఇంజనీర్ రూభినా,లైన్ మెన్ వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్....

**జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి**

**ఆకుల పెంటయ్య జన్మదిన వేడుకలు..**





మెదక్ , (గౌతమ్ న్యూస్): కొల్చారం మండలం సీనియర్ ( కంట్రిబ్యూటర్) పాత్రికేయుడు, జాతీయ మాల మహానాడు ప్రచార కార్యదర్శి , మెదక్ జిల్లా వనదుర్గ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ఆకుల పెంటయ్య జన్మదిన వేడుకలు రంగంపేట సొసైటీ ఆవరణలో శనివారం సాయంత్రం మాల మహానాడు జర్నలిస్టుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు ఆకుల పెంటయ్య మాట్లాడుతూ నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నా తోటి ( కంట్రిబ్యూటర్స్) పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నాతోటి జర్నలిస్టుల మిత్రులకు విలేకరులకు ఇంటి స్థలాల విషయంలో నా వంతు సహాయంగా స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తో మాట్లాడి నా వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో కొల్చారం మండల పాత్రికేయులు ఎర్ర పురుషోత్తం, కే ప్రవీణ్, ఆకుల భూమయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దొంగతానలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్ట్



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): బైక్ దొంగతానలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్ కూ తరలిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ తెలిపారు. శనివారం మెట్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ దొంగల వివరాలను వెల్లడించారు. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలోని పలు హొటళ్ళు, హాస్పిటల్లో పార్క్ చేసిన బైక్ లను దొంగలించడం అలవర్చుకొని వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారన్నారు. సుమారు 20 బైక్ లను వారి వద్ద నుండి స్వాదీనం చేసుకొన్నట్లు చెప్పారు. బైక్ దొంగలని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, కానిస్టేబుల్స్ కిరణ్, సంతోష్ లను ఆయన్ అభినంధించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉమా మహేశ్వర రావు, సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, కానిస్టేబుల్స్ కిరణ్, సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మశాలి ప్రవీణ్ కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ చేయూత

- సామల రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన చిలువేరు సమ్మయ్య గౌడ్
- కులమతాలకతీతంగా సమ్మి గౌడ్ ఫౌండేషన్ సేవలు ఆదర్శప్రాయం - పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు సామల నరసయ్య
- పేద కుటుంబాలకు అండగా నిలిచి భరోసా కల్పిస్తున్న సమ్మయ్య గౌడ్
- ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు కుర్ణ నగేష్




మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): బాధిత కుటుంబాన్ని పరామర్శించి 75 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు అందజేసిన సమ్మి గౌడ్ ఫౌండేషన్. కేసముద్రం మండలం కేసముద్రం పట్టణం లో శనివారం ఫోటోగ్రాఫర్ సామల ప్రవీణ్ తండ్రి సామల రమేష్ (సామ్యేలు) ఇటీవల గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులు భార్య వెంకటమ్మ, కుమారుడు ప్రవీణ్ కోడలు సౌజన్య, కూతురు ప్రసన్న అల్లుడు గణేష్ లను పరామర్శించి రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతిని తెలిపారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ చిలువేరు సమ్మయ్య గౌడ్. అనంతరం సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుటుంబానికి 75 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు సామల నరసయ్య మాట్లాడుతూ కేసముద్రం మండల కేంద్రంలోని ఏ కుటుంబాలై నా సరే ఆపదలో ఉన్నారని తెలియచేస్తే చాలు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ సమ్మయ్య గౌడ్ వెంటనే అక్కడికి చేరుకొని ఆ కుటుంబాలకు వారి సహాయ సహకారాలు అందజేసి మృతుల కుటుంబాలకు అండగా నిలబడి భరోసా కల్పించడం ఆయన ఉన్నతమైన ఔన్నత్యానికి నిదర్శనం అని అన్నారు. అదేవిధంగా ఏ పదవులు లేకపోయినా కుల మతాలకతీతంగా పేద కుటుంబాలకు, అనాధలకు ఆపదలో ఉన్న వృద్ధులకు, ఆపద ఉందని వారి ఇంటి గడప తొక్కితే చాలు వెనక ముందు ఆలోచించకుండా ఏ సమయంలోనైనా సరే వారి క్షేమం కోరుకునే వ్యక్తిగా వారికి సహాయం అందించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ నుండి సహాయం అందుతుందనే భరోసాతో ధైర్యంగా ఉండే విధంగా ఆలోచన కల్పిస్తున్నారని, ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారికి, వారి ఫౌండేషన్ కు అభినందనలు తెలియజేస్తున్నామని ఇలాంటి ఫౌండేషన్ చైర్మన్ సమ్మయ్య గౌడ్ కు మా అండదండలు ఆదరాభిమానాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నర్సయ్య, ఎర్రం శెట్టి అశోక్, కొండేటి కళాధర్, సామల సూర్యం, అనుమాస కుమార్, ఫోటోగ్రాఫర్ల సంగం మండల అధ్యక్షులు కుర్ణ నగేష్, ఆగే రాము, ఎండి రఫీ, బండారు శ్రీను, పింగిలి నాగరాజు, వివో వెంకటనారాయణ, పొడి శెట్టి వంశీ, ఇనుముల కర్ణాకర్, వనపర్తి లలిత, మురళి, వెంకన్న, సుధాకర్, అర్జున్, శ్రీకాంత్ గౌడ్, ధనమ్మ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు....




# ఆబ్కారి మద్యం మొత్తం బెల్టు షాపులకే

- పట్టి పట్టనట్లు ఆబ్కారి శాఖ,విజిలెన్స్ శాఖ.
- మద్యం కృత్రిమ కొరత సృష్టిస్తున్న సిండికేట్ వైన్ షాపులు.
- మద్యం వినియోగదారులకు బీర్లు,బ్రాండెడ్ మద్యం కొరత...
- మూడు వైన్ షాపుల సిండికేట్ నడిపించేది పేరుమోసిన లిక్కర్ డాన్




బయ్యారం,(గౌతమ్ న్యూస్): బయ్యారం మండలంలో పేరుకే మూడు వైన్ షాపులు ,అంతా ఒక్కరే నడిపిస్తున్నారు. ..సమ్మక్క ,శ్రీరామ ,కనక దుర్గ వైన్ షాపులు సిండికేట్ తో మండలంలో మద్యం కొనుగోలుదారులకు జేబులకు చిల్లు పెడుతూ, బెల్టు షాపులకూ మద్యం గ్రామ గ్రామాన ప్రయివేటు ఆటో వాహనాల నుండి ఏరులై పారిస్థున్నారు.ప్రతినెల ఆబ్కారి ఇండెంట్ మద్యం వైన్ షాపులలో పెట్టరు. అంతా బెల్టులకే తరలించి ఎక్కువ రేట్లకు సొమ్ము చేసుకొని కోట్ల రూపాయలు గడిస్థున్నారు.రోజు



ఉదయం నుండి రాత్రి వరకు సుమారుగా 10 ,15 ప్రయివేటు వాహనాలలో ఆటోలలో ,ట్రాలీలో మద్యం తరలిస్థున్నారు.బ్రాండెడ్ మద్యం ,బీర్ ,మాత్రం ఆ షాపులలో చూద్దామన్నా కనపడవని, షాపులలో ఎమ్ ఆర్ పి రేట్లకు అమ్మితే గిట్టుబాటు కాదని ,గుట్టుగా తమ పని కాజేస్థున్నారని వినియోగదారుల ఆరోపిస్థున్నారు.అదే బెల్టు షాపులలో




ఎప్పుడూ మద్యం అందుబాటులో ఉంచుతూ బాటిల్ కు 15 నుండి 20 రూపాయలకు అధనం రేట్లకు బెల్టుకు ట్రాన్సు పోర్టు అవుతున్నాయి. వైన్ షాపులలో మద్యం ఛీఫ్ లిక్కర్ సీసాలు పెట్టి మా షాపులలో ఎమ్ ఆర్పీ రేట్లకే అమ్ముతున్నట్లు గంభీర్యం చూపెడుతున్నారు.

**సిండికేట్ లిక్కర్ సీసాలపై ...కోడ్ మార్కుతో బెల్టుకు మద్యం యదేచ్ఛగా తరలింపు.**


మండలంలో ఎస్.ఎస్.కే స్టిక్కర్ లు ముద్రించి మద్యం బాటిల్ పై అతికించి వారి లిక్కర్ మాఫియా ,సిండికేట్ స్టిక్కర్ లు ఉంటే ఆ బెల్టు షాప్ లో మద్యం అమ్మాలి . ఎస్ అంటే శ్రీరామ ,ఎస్ అంటే సమ్మక్క ,కే అంటే కనక దుర్గ వైన్ షాపులు అన్న మాట , స్టిక్కర్ లేదంటే వారిపై కేసులే , మండలంలో మూడు షాపుల మద్యం కాదని వేరే ప్రాంతంలో మద్యం తెచ్చి అమ్మినా ,లేదా ,దావుత్ లకు ,పండుగలకు వేరే ప్రాంతం నుండి మద్యం తేస్థే. సిండికేట్ లిక్కర్ ప్రయివేటు వారి మద్యం స్వాదీనం చేసుకొని నానా యాగి చేసిన సంఘటనలు గతంలో కోకొల్లలు ,సిండికేట్ స్టిక్కర్ లతో మద్యం వ్యాపారం జోరుగా సాగుతుంది.

**లిక్కర్ మాఫియా డాన్ కు రాజకీయ అండ**





లిక్కర్ మాఫియా డాన్ రాష్ట్రంలో పేరు మోసిన ఇతను మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నివాసి ఇతను ఏ పార్టీ అధీకారంలో ఉంటే ఆపార్టీ చెంతన చేరి లిక్కర్ స్పిరిట్ దందా మూడు పూవులు ఆరుకాయలుగా మద్యం వ్యాపారం వర్ధిలేందుకు ప్లాన్ లు వేసుకొని ఆయన వ్యాపారం యదేచ్ఛగా దశాబ్దాల తరబడి నడిపించడం ఆయన నైజం.ఆయనకు ఎదురు తిరిగి వ్యాపారం చేయాలంటే అవతలి వారికి ముచ్చమటలే.. లిక్కర్ డాన్ పెద్దల ,రాజకీయ నాయకులకు అధికారులకు నెల నెల ఎవరి వాట వారిదే అనో పలువురు చర్చించుకుంటున్నారు.

# కొల్లాపూర్ లో ఘనంగా మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలు




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యటక శాఖ మంత్రి కొల్లాపూర్ శాసనసభ్యులు రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు కొల్లాపూర్ నియోజక వర్గంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు, కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, కోడేరు, చిన్నంబాయి, వీపనగండ్ల, పాన్గల్ పెంట్లవెల్లి మండలాలలోని వివిధ గ్రామాలలో జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకల సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరాలు వైద్య పరీక్షలు రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు అభిమానులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు జూపల్లి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ కేకు కట్ చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఎక్కడ చూసినా నియోజకవర్గం లోనే కాక రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలనుఛ జరుపుకున్నారు, రాజకీయాల్లో అలుపెరుగని నాయకునిగా రాజకీయ అనుభవం కలిగిన కోవిదుడుగా ఆయన ప్రత్యేక స్థానం ఉంది, అందుకే కొల్లాపూర్ నియోజక వర్గంలో శాసన సభ్యునిగా మంత్రిగా తిరుగులేని శక్తిగా ఆయన రాజకీయాల్లో ప్రతి ఎన్నికల్లో గెలుపు దిశగా పయనిస్తున్నారని ఆ పార్టీ కార్యకర్తలు ముఖ్య అనుచరులు పేర్కొన్నారు, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో జూపల్లి అంటే ఒక ప్రభంజనం ఒక ఆదిశక్తి పేద ప్రజల కోసం రైతుల కోసం మహిళల పట్ల నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న నాయకుడిగా ఆయనకు పెట్టిన పేరుగా ఉంది, అలాంటి నాయకుడు కొల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధి కోసం మరికొన్ని సంవత్సరాల పాటు రాష్ట్ర మంత్రిగా పనిచేయాలని ప్రజల ఆకాంక్షిస్తూ ఆయన ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,



## రెండున్నర ఎకరాల పత్తి చేను రాత్రికి రాత్రే పీకేసిన దుండగులు

### భూ వివాదమే కారణమని తెలిపిన భూమి యజమాని నాగబోయిన కైలాసం.





వరంగల్ (గౌతమ్ న్యూస్): జిల్లా,చెన్నారావుపేట మండలం,కోనాపురం గ్రామానికి చెందిన నాగబోయిన కైలాసం అనే రైతు గత మూడు సంవత్సరాల నుండి తన పంటను నష్టపోతున్నట్లు తెలిపారు.శుక్రవారం రాత్రి వేళల్లో తన పత్తి పంటను పీకేసినట్లు తెలిపారు.మొలకెత్తిన వరి నారును కొయ్యగా,వారం రోజుల క్రితం ఎకరం పైచిలుకు పత్తిని పీకేయగా స్థానిక చెన్నారావుపేట పోలీస్స్టేషన్లో ఫిర్యాదులు ఇచ్చినట్లు మళ్లీ అంతలోనే పూర్తి



పంటను పికేసినట్లు తెలిపారు.రైతు మాట్లాడుతూ:గత మూడు సంవత్సరాలు నుండి ప్రతి పంటను ధ్వంసం చేస్తున్నారని, మొక్కజొన్న వేస్తే గడ్డి మందు కొట్టారని ఇట్టి విషయాన్ని సి.పి. వరకు కూడా తీసుకెళ్లామని, ఈ వివాదానికి కారణం గతంలో ఇద్దరు కలిసి భూమిని కొన్నామని, తనతో పాటు భూమి కొన్న వ్యక్తి లేని భూమిని సైతం కొన్నట్లుగా పట్టా చేశారని, ఇప్పుడు పట్టాలో ఉన్నంత భూమి ఇవ్వాలని వేధిస్తున్నారని, మరియు ప్రభుత్వ భూమిని సైతం పట్టాలో విలీనం చేసి అమ్మారని, వెంటనే ప్రభుత్వ భూమిని మాకు అమ్మిన యజమానిపై మరియు లేని భూమిని సృష్టించిన వారిపై,నా పంట నష్టానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## పాపన్న గౌడ్ 374వ జయంతి వారోత్సవాలు జయప్రదం చేయండి

### మోకుదెబ్బ నాయకులు రమేష్ గౌడ్ పిలుపు



నర్సంపేట(గౌతమ్ న్యూస్): ఈ నెల 18 నుండి 25 వరకు జరిగే తెలంగాణ తొలి దళిత బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి వారోత్సవాలు జయప్రదం చేయాలనీ గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తెలిపారు. నర్సంపేట పట్టణంలో మోకుదెబ్బ పొలిట్బ్యూరో సమావేశం గోప గాని వెంకట్ గౌడ్ అధ్యక్షతన శనివారం జరిగింది.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుండి 25 వరకు ప్రతి మండల కేంద్రాలలో పాపన్న విగ్రహాల వద్ద, లేని చోట పాపన్న చిత్ర పటాల వద్ద ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలను కలుపుకొని జయంతి కార్యక్రమం నిర్వహించాలాన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే రాజ్యాధికారం ఒక్కటే శరణ్యమని 356 సంహాత్సరాల క్రితమే చాటి చెప్పిన యోధుడు పాపన్న అని పేర్కొన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లా కు పాపన్న జిల్లా గా నామకరణం చేయాలని రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అమరవేణి నర్సాగౌడ్, రాగుల సిద్ది రాములు గౌడ్, ఏవి బాలేషం గౌడ్, బాలాగాని సురేష్ గౌడ్, కొండాపురం బాలరాజ్ గౌడ్. ముత్యం నర్సింహులు గౌడ్, కొండ గోని రవి గౌడ్,పశ్చిమడ్ల స్వామి గౌడ్, మంద రామారావు గౌడ్, గోడిశాల సాధానందం గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, మచ్చిక రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## కార్ల వర్క్‌షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం.. 16 లగ్జరీ కార్లు దగ్ధం



హర్యానాలోని గురుగ్రామ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఓ కార్ల వర్క్‌షాప్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో 16 లగ్జరీ కార్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.7 కోట్లు విలువైన కార్లు బూడిదయ్యాయని సమాచారం. సెక్టార్ 41 ఏరియా మోతీ విహార్ ప్రాంతంలోని బెర్లిన్ మోటార్ వర్క్‌షాప్‌లో శనివారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అయితే.. పలు ఖరీదైన కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. పదహారు లగ్జరీ కార్లు వర్క్‌షాప్‌లో పార్క్ చేశారని.. ఇవన్నీ కాలి బూడిదయ్యాయని అగ్నిమాపక అధికారులు తెలిపారు. వీటితోపాటు కొన్ని పాత వాహనాలు కూడా దగ్ధమైనట్లు చెప్పారు. సమాచారమందుకున్న వెంటనే ఘటనాస్థలికి వెళ్లి మంటలను ఆర్పివేశామని పేర్కొన్నారు. మెర్సిడెస్, ఆడి క్యూ 5, బీఎమ్‌డబ్ల్యూ, రేంజ్ రోవర్, వోల్వో, ఫోర్డ్ ఎకో స్పోర్ట్, ఒపెల్ ఎస్ట్రా మరియు జాగ్వార్‌తో సహా పదహారు అత్యాధునిక కార్లు వర్క్‌షాప్‌లో పార్క్ చేశారు. ఇవన్నీ బూడిదగా మారాయి. అగ్నిప్రమాదంలో కొన్ని స్క్రాప్డ్ వాహనాలు కూడా దగ్ధమైనట్లు అధికారి తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మూడు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారని వెల్లడించారు. అగ్నిప్రమాదానికి కారణం ఇంకా తెలియబడలేదన్నారు.

## నితీష్ కుమార్ పార్టీలో 'వక్ఫ్ బిల్లు' కల్లోలం..

# రెండుగా చీలిన నేతలు..



వక్ఫ్ బోర్డు 'అపరిమిత అధికారాల'కు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుని తీసుకువచ్చింది. అయితే, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో, జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని కేంద్రం ఏర్పాటు చేసింది. ఇదిలా ఉంటే ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ ఈ బిల్లుకు లోక్‌సభలో మద్దతు ప్రకటించింది. కాగా, క్షేత్రస్థాయిలో మాత్రం నితీష్ కుమార్‌కి చెందిన జేడీయూ పార్టీలో 'వక్ఫ్ బిల్లు' చీలికలువ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ బిల్లుపై పార్టీ నేతలు రెండుగా చీలిపోయారు. ఇటీవల బిల్లుకు జేడీయూ ఎంపీ, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ మద్దతు తెలిపారు. ఇది వక్ఫ్ బోర్డుల పనితీరులో పారదర్శకతను తీసుకురావడానికి తెచ్చిన బిల్లుగా పేర్కొన్నారు. ఇది ముస్లింలకు వ్యతిరేకం కాదని అన్నారు. ఈ బిల్లు మసీదు లేదా దేవాలయానికి సంబంధించింది కాదని, వక్ఫ్ బోర్డుల పారదర్శకతను ప్రోత్సహించడానికి తెచ్చినదని చెప్పారు. అయితే, రంజన్ సింగ్ వ్యాఖ్యలపై జేడీయూ నేత, మాజీ ఎమ్మెల్సీ గులాం గౌస్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 7 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్న వక్ఫ్ బోర్డు భూములను స్వాధీనం చేసుకునేందుకు ఈ బిల్లు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా బీజేపీ ఈ బిల్లుని తీసుకువచ్చిందని అన్నారు. వక్ఫ్ భూముల్ని లాక్కోవడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని చెప్పారు. మరో జేడీయూ నేత, ముఖ్యమంత్రి కీలక సహాయకుడు విజయ్ కుమార్ చౌదరి వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపాలన్న కేంద్ర నిర్ణయాన్ని ప్రశంసించారు. మైనారిటీ కమ్యూనిటీలో ఈ బిల్లుపై భయాలు ఉన్నాయని, అయితే జేపీసీ పరిశీలనకు పంపాలన్న కేంద్రం నిర్ణయాన్ని సమర్థించారు. మైనారిటీ వర్గాలకు సంబంధించిన సమస్యలను అత్యంత సున్నితత్వంతో పరిష్కరించాలని మా నేత నితీష్ కుమార్ నమ్ముతారని అన్నారు. అయితే, పార్టీలో అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు నితీస్ కుమార్ పార్టీ నేతలతో భేటీ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

# సింగరేణిలో కార్మికుల ప్రాణాల కన్నా ఉత్పత్తి ప్రధానం కాదు

### సింగరేణి సిఎండి ఎన్ బలరాం ఐఆర్ఎస్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): సింగరేణి భవన్ : అందరం కలిసి సురక్షిత సింగరేణిని ఆవిష్కరిద్దాం.. రక్షణ లేని ఉత్పత్తి అవసరం లేదు కార్మికుల ప్రాణాల కన్నా ఉత్పత్తి ప్రధానం కాదు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ పిలుపునిచ్చారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా అన్ని గనుల సేఫ్టీ, మైన్స్ కమిటీ ప్రతినిధులతో సుదీర్ఘ సమీక్ష 11 ఏరియాల నుంచి హాజరైన 1500 మంది ఉద్యోగులు రక్షణ పై ప్రతి ఏరియా నుంచి సూచనలు చేసిన కార్మికులు సింగరేణి భవన్, ఆగస్టు 10, 2024 బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల ప్రాణాలు విలువైనవని, రక్షణ లేని ఉత్పత్తి అవసరం లేదని, రక్షణ పై ఉన్న నియమ నిబంధనలను పాటిస్తూ అందరూ కలిసి సురక్షిత సింగరేణిని ఆవిష్కరించే లక్ష్యంతో పనిచేస్తూ ఉత్పత్తిని సాధించాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా ఆయన 11 ఏరియాలోని మొత్తం 40 గనులు, విభాగాలకు చెందిన రక్షణ కమిటీలు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, మైన్స్ కమిటీ సభ్యులు, ఇతర రక్షణ సూపర్వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎప్పుడూ గనుల్లో మేనేజర్ల సమక్షంలోనే జరిగే ఈ సమావేశాన్ని సంస్థ సీఎండీ స్వయంగా నిర్వహించి నేరుగా సలహాలు సూచనలు స్వీకరించడం ఇదే తొలిసారి కావడంతో కార్మికులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ అన్ని రంగాలలో అత్యుత్తమ కంపెనీగా నిలిచినప్పటికీ ప్రమాదాల నివారణలు మాత్రం కొంత వెనకబడటం విచారకరమని, దీనికి కారణం ఎక్కువగా మానవ తప్పిదాలే అని సీఎండీ పేర్కొన్నారు. ప్రతి పనికి కొన్ని ఎస్ ఓ పి (సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) నిర్దేశించబడ్డాయని, వీటిని సరిగా పట్టించుకోక పోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ వీటిని పాటించాలన్నారు. కార్మికుల రక్షణకు ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా సౌకర్యాలు సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణులను నియమిస్తున్నామని, రామగుండం ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా రూపుదిద్దుతున్నామని హామీ ఇచ్చారు. సూపర్వైజర్ల, ఇతర ఉద్యోగుల కొరతను తీర్చేందుకు 1800 పోస్టులకు ఇప్పటికే నియామకల ప్రక్రియ చేపట్టామని, వచ్చే రెండు నెలల్లో ఇది పూర్తవుతుందన్నారు. తద్వారా గనుల్లో సూపర్వైజర్ల కొరత ఉండబోదని స్పష్టం చేశారు. కార్మిక కాలనీలను గేటెడ్ కమ్యూనిటీ గా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. చాలామంది ఉన్నత చదువులు చదివిన యువకులు ఉద్యోగాలు లేకుండా ఖాళీగా ఉన్నారని, అలాంటిది సింగరేణిలో ఉద్యోగ అవకాశం లభించిన వాళ్లంతా అంకితభావం, సంస్థ పట్ల కృతజ్ఞతతో పనిచేయాలన్నారు. గనిలో జరిగే ప్రమాదాల కన్నా రోడ్డు ప్రమాదాల్లో యువ కార్మికులు మృతి చెందని పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రక్షణ పై అవగాహనకు ఎంవీటీసీలలో ప్రత్యేక శిక్షణలు ఇప్పించనున్నట్లు, అలాగే ఎంవీటీసీలను ఆధునికీకరించనున్నట్లు తెలియజేశారు సమావేశంలో పాల్గొన్న రక్షణ, మైన్స్ కమిటీ సభ్యులు అనేక విలువైన సూచనలు చేశారు. వారసత్వ ఉద్యోగాల కారణంగా ఉన్నత చదువులు చదివిన యువకులు సింగరేణిలో చేరారని, వీరికి గనిలో పని చేయడంలో మరింత ప్రత్యేక శిక్షణ అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. సీనియర్ కార్మికులు రిటైర్ అవ్వటం వల్ల కొంత అనుభవ రాహిత్యం ఏర్పడుతుందన్నారు. కార్మికులకు నాణ్యమైన బూట్లు అందించాలని, గనుల్లో మరింత అధునాత ఆటోమేషన్ జరపాలని సూచించారు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో ప్రతి ఏరియా నుంచి మాట్లాడిన కార్మికులు సీఎండీ తో నేరుగా మాట్లాడే అవకాశం లభించడంతో భావోద్వేగాలకు గురయ్యారు. ఈ సమావేశంలో కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు ఎన్ వి కె శ్రీనివాస్ (ఆపరేషన్స్, పర్సనల్), డి సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), జి వెంకటేశ్వర్ రెడ్డి( పి అండ్ పి) మాట్లాడారు. సమావేశానికి జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ స్వాగతం పలికారు. జీఎం మార్కెటింగ్ రవి ప్రసాద్, అన్ని ఏరియాల నుంచి జీఎంలు, కార్పోరేట్ జీఎంలు పాల్గొన్నారు.

## కొల్లూరి రేవంత్ మృతి పై విచారించి, దోషులను బయటపెట్టి, కఠినంగా శిక్షించాలి

### ఆర్.ఎస్.పి, దళిత ప్రజా సంఘాల డిమాండ్




పర్వతగిరి (గౌతమ్ న్యూస్): వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కొల్లూరి రేవంత్ కుమార్ (28) కు, జూన్ 8న ఉదయము దాదాపు రెండు గంటల ప్రాంతంలో రోడ్డు యాక్సిడెంట్ జరిగిందని, ఆ తర్వాత దాదాపు 4 గంటల ప్రాంతంలో తన తండ్రికి ఫోన్ చేసిచెప్పడంపై పలు అనుమానాలు ఉన్నాయని, రేవంత్ కుమార్ మృతి పై విచారించి, దోషులను బయటపెట్టి, కఠినంగా శిక్షించాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పి) రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్, అంబేద్కర్ ఫెలోషిప్ రాష్ట్ర అవార్డు గ్రహీత, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిర్రు కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పర్వతగిరి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ మృతుని తండ్రి కొల్లూరి నాగరాజు తన కుమారునికి జరిగిన అన్యాయాన్ని బుధవారం పలు రకాల పత్రికా ప్రకటన ద్వారా వచ్చిన సమాచారంపై స్పందించి, ఈ ప్రకటన విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రేవంత్ కుమార్ మృతి పై విచారణ చేపట్టి, నిందితులను బయటపెట్టి, కఠినంగా శిక్షించాలనే సమాచారాన్ని చూసామని, మృతుని తండ్రి నాగరాజు తెలిపిన విధంగా హైదరాబాదులోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై కాంతయ్య, కానిస్టేబుల్ విశాల్ కేసును పక్కదోవ పట్టించి దోషులను కాపాడే ప్రయత్నం చేశారని, యాక్సిడెంట్ జరిగిన బైకును పోలీస్ స్టేషన్ తీసుకురాకుండా నిర్లక్ష్యం వహించడం ఎందుకో అర్థం కావడం లేదని వారు ప్రశ్నించారు. తక్షణమే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కొల్లూరి రేవంత్ కుమార్ మృతి పై బాలానగర్ ఇన్స్పెక్టర్ నిష్పక్షపాతంగా విచారించి, దోషాలు ఎంతటి వారైనా బయటపెట్టి కఠిన శిక్ష పడేవిధంగా చూడాలని కోరారు. మృతుడు రేవంత్ కుమార్ జూన్ 8వ తారీకున ఉదయము గంటలు 1:25 నిమిషాలకు తన దగ్గరి మిత్రునికి ఫోన్ చేశాడంటే, ఆ సమయంలో ఏదో జరిగిందోనని అర్థమవుతుందని, అదే రోజు గం" 2:00 తర్వాత రోడ్ యాక్సిడెంట్ జరిగినట్లు, గంటలు 2:30 నిమిషాలకు 108 అంబులెన్స్ కు ఫోన్ చేసినట్లు చూపారని, ఈ మధ్యకాలంలో ఏమి జరిగిందో గుర్తించి దోషులను బయటపెట్టి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయం పై సైబరాబాద్ కమిషనరేట్ సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను బయటికి చెప్పవలసిన బాధ్యత ఉందని వారు గుర్తుచేశారు. లేనిచో ఆర్ఎస్పి, దళిత ప్రజా సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

## ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కేరళ అతలాకుతలం..

# అండగా నిలిచిన మోదీ సర్కార్..!



ఢిల్లీ: కేరళ రాష్ట్రాన్ని ఊహించని ప్రళయం కారణంగా దేశ మొత్తం అయ్యో పాపం కేరళ అనే రీతిలో అతలాకుతలం చేసింది. చిన్నపాటి నిర్లక్ష్యం వందల సంఖ్యలో మృతులకు కారణమైంది. ప్రకృతి సృష్టించిన బీభత్సంతో అతలాకుతలమైన వయనాడ్ జిల్లాలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. అందులో భాగంగా చూరల్మల, ముండక్కై గ్రామాలను ఆయన సందర్శించారు. అలాగే పునరావాస కేంద్రాలను సైతం ప్రధాని మోదీ సందర్శించి.. అనంతరం జరుగుతున్న సహాయ, పునరావాస చర్యలపై ఉన్నతాధికారులతో ప్రధాని సమీక్ష నిర్వహించారు. జాతీయ విపత్తుగా పరిగణించాలని ప్రధాని మోదీని కలిసి రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో వయనాడ్ ఘటనను ప్రధాని మోదీ జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశముంది. జూలై 30వ తేదీన వయనాడ్‌లో ప్రకృతి విలయం తీవ్ర నష్టం కలిగించింది. కొండచరియలు విరిగిపడటంతో వైత్తిరి తాలూకాలోని ముండక్కై, చూరల్‌మల, అట్టమల గ్రామాలు ప్రభావితమయ్యాయి. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో బురద, రాళ్లతో కూడిన నదీ ప్రవాహం ఊళ్లపై విరుచుకుపడింది. దీంతో పెను ప్రమాదం సంభవించింది. వయనాడ్ విపత్తులో 400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా 200 మందికి పైగా ఆచూకీ లభ్యం కాలేదు. ప్రకృతి విపత్తుతో వెంటనే అప్రమత్తమైన నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిస్థితిని సమీక్షించింది. సంఘటన స్థలంలో రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్ కోసం ఎన్‌డిఆర్ఎఫ్ , ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ, ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ వంటి 1200 మందికి పైగా రక్షకులను మోహరించడం ద్వారా వెంటనే చర్యలు చేపట్టింది. వైద్య సహాయం, చికిత్స కోసం డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందితో పాటు 100 కి పైగా అంబులెన్స్‌లను సమకూర్చింది. విపత్తు సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండటానికి సకాలంలో నిధులు సమకూర్చడం ద్వారా కేంద్రం కేరళకు సహాయం చేస్తోంది. ఏప్రిల్ 1న, కేరళ ఎస్ఆర్‌డిఎఫ్ ఖాతాలో దాదాపు రూ. 395 కోట్లు ఉన్నాయి. 145.60 కోట్లకు పైగా కొనసాగుతున్న సంవత్సరానికి ఎస్ఆర్‌డిఎఫ్ సెంట్రల్ వాటా మొదటి విడత జూలై 31న ముందస్తుగా విడుదల చేయడం జరిగింది. గత 5 ఏళ్లలో మొత్తం దాదాపు రూ. 1780 కోట్లు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో ఎస్ఆర్‌డిఎఫ్ లో కేంద్రం వాటాగా 1200 కోట్ల రూపాయలను మోదీ ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి తోడు మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్ర విపత్తుల నివారణ నిధికి రూ. 445 కోట్లు విడుదల చేసింది. విలయానికి చురల్‌మల, ముండక్కై గ్రామాలు శిథిలమైయ్యాయి. నాలుగు గ్రామాలైతే రూపురేఖలే కనిపించని దుస్థితి. విపత్తు జరిగిన రోజు నుంచి దాదాపు 10 రోజుల పాటు ఆర్మీ సహాయక చర్యల్లో పాల్గొంది. వరద విలయంలో ఆర్మీ అసామాన్య కృషి ఎవ్వరూ మరిచిపోలేరు. ముండక్కైకి కృత్రిమ వంతెన నిర్మించిన ఆర్మీ, 150 మంది జవాన్లు 31 గంటల్లో 190 అడుగుల బ్రిడ్జిను నిర్మించారు. ఇది భారీ యంత్రాలు, అంబులెన్స్‌ల కదలికను సులభతరం చేయడంలో కీలకంగా మారింది. విశేషమేమిటంటే, ఈ వంతెన నిర్మాణం కేవలం 71 గంటల్లో పూర్తయింది, ఆర్మీ సహాయక చర్యలు ముగియడంతో తిరుగు ప్రయాణమైన జవాన్లకు వీడ్కోలు పలుకుతూ వయనాడ్ ప్రజలు కన్నీటి పర్యంతం అయ్యారు.విపత్తు సమయంలో తమకు ఎంతో సాయం చేసినందుకు ఆర్మీకి కృతజ్ఞతలు చెప్పారు. వయనాడ్‌లోని ప్రభావిత ప్రాంతాలను సందర్శించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఆగస్టు 8 నుంచి 10వ తేదీ వరకు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుంది. కేరళకు సహాయ నిధులు అందించేందుకు కేంద్రం సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. బాధితులకు అన్నివిధాలుగా అండగా నిలిచింది కేంద్ర ప్రభుత్వం. వారి కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. రిలీఫ్ సెంటర్లలో ఉన్న వాళ్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. వాళ్లందరికి కౌన్సెలింగ్ ఇప్పించారు. వీలైనంత త్వరగా పునరావాసం కల్పిస్తామని అధికారులు భరోసా కల్పించారు. కేంద్ర మంత్రి సురేశ్ గోపి దగ్గరుండి పరిస్థితులను పర్యవేక్షించారు. సామాజిక కార్యకర్తలు , స్వచ్ఛంద సంస్థలు , సైకాలజిస్ట్‌ల సాయం తీసుకుంటున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, కొండచరియలు విరిగిపడిన చోట.. అడ్వాన్స్ రాడార్స్, డ్రోన్స్, హెవీ మిషన్స్ ఉపయోగిస్తున్నారు రెస్క్యూ సిబ్బంది. చలియార్ నదీ తీరంలో 40 కిలోమీటర్ల మేర సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. మలప్పురంలోని నీలాంబర్ ప్రాంతంలో చాలా మృతదేహాలు దొరికాయి. చలియార్ రివర్‌లో 73 మృతదేహాలు, 132 బాడీ పార్ట్స్ గుర్తించారు. దొరికిన మృతదేహాల్లో 37 పురుషులు, 29 మహిళలు, ముగ్గురు బాలురు, 4 బాలికలు ఉన్నారన్నారు మలప్పురం అధికారులు. %చీణ=ఖీ, ఖ%-9 డాగ్ స్క్వాడ్, ఆర్మీ, నేవీ, కోస్ట్‌గార్డ్, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్, పోలీసులు, అటవీ, ఫైర్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. అణువణువు జల్లెడ పడుతున్నారు. కొండ ప్రాంతాల్లో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని తాళ్ల సాయంతో కిందకు తీసుకొచ్చారు. ఇంకా ఎవరైనా కొండల్లో చిక్కుకున్నారా అని.. డ్రోన్స్ సాయంతో వెతుకుతున్నారు. మరోవైపు.. ఇళ్ల చుట్టూ చేరిన వరద, చెత్తా చెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నం అయ్యారు సహాయక సిబ్బంది. వయనాడ్ విధ్వంసానికి మనిషి దురాశే ప్రధాన కారణమని లండన్ ఇంపీరియల్ కాలేజ్ రీసెర్చ్ అభిప్రాయపడింది. వయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించిందనీ దాంతో ఒకప్పుడు చల్లగా ఉండే వయనాడ్ ప్రాంతం ఇప్పుడు వేడిగా, పొడిగా మారిపోయిందని తెలిపింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయని అన్నారు.

## సుంకిశాలపై మాటల యుద్ధం.. రాహుల్ గాంధీని లాగిన కేటీఆర్



రాజధాని హైదరాబాద్ ప్రాంతానికి తాగునీరు కోసం నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టులో జరిగిన ప్రమాదం తెలంగాణలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. సుదీర్ఘ కాలం పాటు హైదరాబాద్‌కు తాగునీటి కొరత తీర్చే సద్దుదేశంతో నిర్మించిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి ప్రమాదం బారిన పడిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై అధికార కాంగ్రెస్ ప్రతి విమర్శలు చేసింది. అయితే వాస్తవాలను వక్రీకరించి సుంకిశాల ప్రాజెక్టు నెపాన్ని తమపై నెట్టేస్తుండడంతో కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. స్థానిక నాయకత్వానికి కాకుండా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకే ప్రశ్నలు సంధించారు. సుంకిశాల ప్రాజెక్టుపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'కోట్లాది రూపాయల నష్టం జరిగిన తర్వాత కూడా సుంకిశాల ప్రమాదాన్ కాంగ్రెస్ పార్టీ చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. లోపభూయిష్టంగా పనులు చేసిన కాంట్రాక్టింగ్ ఏజెన్సీని బ్లాక్ లిస్ట్ చేయడానికి తెలంగాణ ప్రభుత్వాన్ని ఎవరు, ఎందుకు ఆపుతున్నారో చెప్పాలి' అని కేటీఆర్ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదం వ్యవహారంలో నిష్పాక్షికంగా విచారణ జరిగేలా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు' అని నిలదీశారు. ఈ మొత్తం ప్రమాదాన్ని చిన్నదిగా కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారో, దీనికి బాధ్యులు ఎవరో తెలుపాలని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా సుంకిశాల ప్రమాదం వీడియోను 'ఎక్స్'లో పంచుకుంటూ కేటీఆర్ రాహుల్ గాంధీకి ప్రశ్నలు జరిపించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు చేరువగా హైదరాబాద్ తాగునీటి కోసం సుంకిశాల ప్రాజెక్టు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ శంకుస్థాపన చేశారు. 2024 వేసవికాలం వరకు ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చి హైదరాబాద్ ప్రజలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా విధించారు. అయితే అనూహ్యంగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడంతో సుంకిశాల ప్రాజెక్టు పనులు నెమ్మదించాయి. దీనిపై విమర్శలు రావడంతో వర్షాకాలంలో పనులు మొదలుపెట్టగా అప్పటికే నాగార్జున సాగర్‌కు భారీగా వరద రావడంతో సుంకిశాల ప్రాజెక్టు పనులకు అవాంతరం ఎదురైంది. అయినా కూడా పనులు జరుపుతుండడంతో ఈనెల 2వ తేదీన ఈ ప్రాజెక్టు టన్నెల్ కూలింది. ప్రస్తుతం ఈ ఘటనపై తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీకి కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

## "ఏ దుస్తులు వేసుకోవాలో మీరెలా నిర్ణయిస్తారు".. హిజాబ్ వివాదంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ: హిజాబ్, బురఖా, నిఖాబ్ ధరించడంపై నిషేధం ఉన్న ముంబైలోని ఓ ప్రైవేట్ కాలేజీ సూచనలను సుప్రీంకోర్టు పాక్షికంగా స్టే విధించింది. ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠే కాలేజీని నిర్వహిస్తున్న 'చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీ'కి నవంబర్ 18లోగా సమాధానం ఇవ్వాలని సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. క్యాంపస్‌లో హిజాబ్, బురఖాలకు వ్యతిరేకంగా ముంబయిలోని ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠీ కాలేజీ ఇటీవల సర్క్యులర్‌ను జారీచేసిన సంగతి తెలిసిందే. కాలేజీ ఆదేశాలను సవాలు చేస్తూ ముస్లిం విద్యార్థులు బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు కళాశాలకు అనుకూలంగా తీర్పు చెప్పడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాలేజీ ఆదేశాలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. యాజమాన్యం తరఫు న్యాయవాది మాధవి దివాన్ తన వాదనలు వినిపించారు. విద్యార్థుల మతం బహిర్గతం చేయకూడదనే లక్ష్యంతో ఈ నిబంధన పెట్టినట్లు కోర్టుకు తెలిపారు. దీంతో ఒక్కసారిగా న్యాయమూర్తులు మండిపడ్డారు. విద్యార్థుల పేర్లలో మతం ప్రతిబింబించలేదా? పిల్లలను వారి రోల్ నంబర్లను బట్టి పిలుస్తారా?, మతాన్ని బహిర్గతం చేయొద్దనేది మీ ఉద్దేశమైతే విద్యార్థులు బొట్టు ఎందుకు పెట్టుకుంటున్నారు? బొట్టు పెట్టుకోవడాన్ని ఎందుకు నిషేధించలేదు? ఇలాంటి నిబంధనలను అమలు చేయడం అంటే మతాన్ని బయటపెట్టడం కాదా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. కాలేజీ ఎప్పటి నుంచి నడుస్తోంది అని జస్టిస్ ప్రశ్నించారు. 2008 నుంచి ఉనికిలో ఉందని మాధవి దేవాన్ బదులిచ్చారు. దీనిపై న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'ఇన్నేళ్లుగా మీరు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు.. మీకు హఠాత్తుగా ఎందుకు గుర్తుకు వచ్చింది? ఇన్నేళ్ల తర్వాత మీరు ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం విచారకరం. బొట్టుతో వచ్చే విద్యార్థులను అనుమతించబోమని చెప్పగలరా? అని నిలదీసింది. దీనిపై మాధవి దివాన్ మాట్లాడుతూ.. '441 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలకు ఆనందంగా హాజరయ్యారు. ఈ నిబంధనలపై కొంతమంది విద్యార్థులు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు." అని తెలిపారు. "అమ్మాయిలు ఏ దుస్తులు వేసుకోవాలో మీరెలా నిర్ణయిస్తారు.. అమ్మాయిలు ఏ రకమైన దుస్తులు వేసుకోవాలనుకుంటున్నారో వారికే వదిలేయాలి" అని కోర్టు వ్యాఖ్యానించింది.

## హమాస్ నిర్మూలనే లక్ష్యంగా సాగుతున్న ఇజ్రాయెల్.. గాజాలో మళ్ళీ దాడి.. 100 మంది మృతి



గత ఏడాది హమాస్ ఉగ్రవాదులు అకస్మాత్తుగా ఇజ్రాయెల్‌పై దాడులు చేసి.. మరణ హోమం సృష్టించారు. కొన్ని వందల మందిని బందీలుగా తీసుకుని వెళ్ళారు. తమపై జరిగిన దాడులకు ప్రతీకార దాడులు చేస్తామని ప్రకటించింది. హమాస్‌ను భూస్థాపితం చేస్తామంటూ 10 నెలల నుంచి గాజాలోని హమాస్ స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులుచేస్తూనే ఉంది. అయితే ఇటీవల హమాస్ కు భారీ దెబ్బ తగిలింది. హమాస్ తో పాటు హెజ్‌బొల్లాల కీలక నేతలు దాడుల్లో మరణించారు. దీంతో హమాస్ కు సాయంగా ఇరాన్ .. యుద్ధంలోకి దిగనున్నట్లు హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా హమాస్ ఉగ్రవాదులతో కలిసి దాడి చేసే ప్రమాదం ఉంది. దీంతో ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే మరోవైపు ఇజ్రాయెల్ గాజాలో వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్న హమాస్ కి చెందిన వ్యక్తులపై దాడు నిర్వహిస్తూనే ఉంది. నిరంతరం గాజాపై ఇజ్రాయెల్ విరుచుపడుతోంది. తాజాగా తూర్పు గాజాలోని ఓ పాఠశాలలో తలదాచుకున్న వారిపై ఇజ్రాయెల్ దాడి చేసిందని అంతర్జాతీయ మీడియా ప్రకటించింది. తూర్పు గాజాలో ఓ పాఠశాలలో కొంతమంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారని.. వీరిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులకు పాల్పడిందని వెల్లడించింది. ఈ దాడిలో దాదాపు వంద మందికి పైగా మరణించారని.. అనేక మంది గాయపడ్డారని తెలిపింది. గత వారంలో కూడా గాజాలోని మూడు పాఠశాలలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 30 మంది మరణించారు. పలువురు మృతి చెందారు. ఇక ఆగష్టు 1న దలాల్ అల్–ముఘ్రబీ స్కూల్‌పై దాడి చేయగా.. 15 మంది మృతి చెందారు. గాజాలో హమాస్ నిర్మూలన జరిగే వరకూ తమ పోరాటం ఆపమని యుద్ధానికి తాము బయపడం అంటూ ఇజ్రాయెల్ ఇప్పటికే ప్రకటించింది. అదే విధమగా గాజాలోని ఉగ్రవాదులపై విరుచుకుపడుతోంది. గాజాపై కురిపిస్తోన్న బాంబుల వర్షంతో భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీటి వ్యవస్థలు ధ్వంసం అయ్యాయి. వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇటీవల హమాస్, హెజ్‌బొల్లాల కీలక నేతల హత్యల నేపథ్యంలో పరిస్థితులు మరింత తీవ్రంగా మారాయి

## బీఎస్ఎన్ఎల్ బంపరాఫర్.. జియో, ఎయిర్‌టెల్‌కు చుక్కలే..




న్యూఢిల్లీ: జూలైలో ప్రముఖ టెలికాం కంపెనీలు రీఛార్జ్ ప్లాన్ల ధరలను అమాంతం పెంచేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జియోపై పెద్ద ఎత్తున మీమ్స్, ట్రోల్స్ వెల్లువెత్తాయి. అంబానీ తన కుమారుడి వివాహ ఖర్చంతా తమ నెత్తిపై వేస్తే ఎలాగని యూజర్లు మొత్తుకున్నారు. ఇక జియో బాటలోనే ఎయిర్?టెల్, వొడాఫోన్ ఐడియా కూడా టారిఫ్ ధరలు పెంచేశాయి. దీంతో జనాలంతా బీఎస్ఎన్ఎలే బెటర్ అనుకుంటున్నారు. ఈ క్రమంలోనే పోర్ట్ ఆప్షన్ ఎంచుకుని దేశవ్యాప్తంగా 2.75 మిలియన్ల మంది బీఎస్ఎన్ఎల్?కు మారిపోయారు. మంచి తరుణం మించిన దొరకదనుకున్న బీఎస్ఎన్ఎల్ మరింత మంది యూజర్లను ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అతి తక్కువ ధరలకే రిచార్జ్ ప్లాన్లను అందిస్తూ జియో, ఎయిర్‌టెల్, వీఐ వంటి సంస్థలకు చుక్కలు చూపిస్తోంది. ప్రస్తుతం రూ.100 కంటే తక్కువ ధరతో అనేక రీచార్జ్ ఆప్షన్స్‌ను బీఎస్ఎన్ఎల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది వినియోగదారులకు అతి తక్కువ ధరలకు లాంగ్ వేలిడిటీని అందిస్తోంది. వాస్తవానికి ప్రైవేట్ టెలికాం కంపెనీలతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్‌కు వినియోగదారులు చాలా తక్కువ మంది ఉన్నారు. అయినా కూడా బీఎస్ఎన్ఎల్ ఏమాత్రం తగ్గడం లేదు. షార్ట్ టర్మ్ నుంచి అధిక ధరల ఆప్షన్స్‌ను అందిస్తూ ప్రైవేటు సంస్థలతో పోటీ పడుతూనే ఉంది. కేవలం రూ.91 తో రీచార్జ్ చేయించుకుంటే చాలు 90 రోజుల పాటు వేలిడిటీ వచ్చేస్తుంది. ఇది వాస్తవానికి బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న బంపర్ ఆఫర్ అనే చెప్పాలి. ఇంత తక్కువ ధరకు 90 రోజుల వ్యాలిడిటీని ఏ సంస్థ కూడా అందించడం లేదు. దీంతో ఈ రూ.91 ప్లాన్ ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం పాటు తమ సిమ్‌ను యాక్టివ్‌గా ఉంచాలనుకునే వినియోగదారులు ఈ ప్లాన్ పట్ల బాగా ఆకర్షితులవుతున్నారు. ఇది మాత్రమే కాకుండా నిమిషానికి 15 పైసలకే వాయిస్ కాల్స్, ఒక పైసాకే ఒక ఎంబీ డేటా, 25 పైసలకే ఎస్ఎమ్మెస్ వంటివి బీఎస్ఎన్ఎల్ ఆఫర్ చేస్తోంది. కాల్స్ మాత్రమే లేదంటే డేటా లేదంటే ఎస్ఎమ్మెస్ కోసం టాక్ టైమ్ వోచర్ లేదా డేటా వోచర్‌ను విడివిడిగా కొనుగోలు చేయాలి. ఇవి చాలా సరసమైన ధరలకు కూడా అందుబాటులో ఉంటాయి. ఇక తాజాగా107 రూపాయల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్?ను సైతం బీఎస్ఎన్ఎల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. 107 రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే 35 రోజుల వేలిడిటీతో 3జీబీ 4జీ డేటాతో పాటు రోజుకు 200 నిమిషాల వాయిస్ కాల్స్ ఫ్రీగా చేసుకోవచ్చు.

# వారి మధ్య పోలిక కరెక్టే!



ఎస్కోబార్‌కు, జగన్‌కు చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. సౌత్ అమెరికాలో కొలంబియా దేశం డ్రగ్స్‌కు చాలా ప్రసిద్ధి. అక్కడ పేద కుటుంబంలో జన్మించిన ఎస్కోబార్ తిరుగులేని మాఫియా డాన్‌గా ఎదిగాడు. మెడలిన్ అనే ప్రాంతంలో తన నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. మాదకద్రవ్యాల ముఠాకు నాయకత్వం వహించాడు. ఆ రోజుల్లోనే కొన్ని లక్షల కోట్లు సంపాదించాడు. ఈ క్రమంలో పెద్ద నేరసామ్రాజ్యాన్నే స్థాపించాడు. ఈ క్రమంలో ఎవరైనా ఎదురు తిరిగితే చంపేసేవాడు. పోలీసు అధికారులను తన చెప్పుచేతల్లో పెట్టుకుని, మాటవినని వారిని భయభ్రాంతులకు గురిచేసేవాడు. కొలంబియాలో ఉన్న అన్ని వ్యవస్థలపై అతడు పెత్తనం చేశాడు. ఎస్కోబార్‌లో ఉన్న అన్ని లక్షణాలను జగన్ రెడ్డి పుణికి పుచ్చుకున్నారు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జగన్ రెడ్డిని ఫ్యాబ్లో ఎస్కోబార్‌తో సరిపోల్చడం సరి అయినదని చెప్పవచ్చు. ఒకానొక దశలో కొకైన్ కింగ్ ఎస్కో బార్‌కు లెక్కపెట్టలేనంతంగా డబ్బు వచ్చిపడేది. వాటిని లెక్కించేందుకు పెద్దపెద్ద మెషిన్లు తెచ్చేవారు. డజన్ల కొద్దీ మనుషులను పెట్టేవాడు. వారికి జీతభత్యాలు కొన్ని లక్షలు చెల్లించేవాడు. 70, 80 దశకాల్లో సుమారు రెండు దశాబ్దాల పాటు అతడి హవా కొనసాగింది. ఈ విషయంలో కూడా జగన్ రెడ్డికి పోలిక ఉంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దాదాపు 4 లక్షల కోట్లు అక్రమం గా సంపాదించారు. ఎస్కోబార్‌కు చిన్నతనంలో పేదరికం కారణంగా డబ్బుపై విపరీతమైన ఆశ పెరిగింది. 2004కు ముందు వైఎస్ కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి హైదరాబాద్ లో ఇల్లు అమ్మకానికి పెట్టారు. వైఎస్ కుటుంబం పేదరికంలో లేకపోయినా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత డబ్బు అవసరమైంది. అది చూసిన జగన్ రెడ్డి.. బాగా డబ్బు సంపాదించాలనే ఆశ కలిగింది. తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖర్ రెడ్డి స్థాపించిన నేర సామ్రా జ్యాన్ని పదింతలు విస్తరించారు. 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు చేతులతో ఎడాపెడా సంపాదించేశారు. ఏ రాజకీయ పార్టీ, ఏ నాయకుడూ చేయని విధంగా అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డారు.

### అవధులు మీరిన సంపాదన..

అధికారం చేపట్టిన 2019-24 మధ్య కూడా డబ్బు సంపాదన పైనే జగన్ రెడ్డి ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇసుక, మద్యం, ఖనిజ సంపద దోపిడీ ద్వారా వేల కోట్లు సంపాదించారు. అక్రమ వ్యాపారం ఒక స్థాయికి వచ్చిన తర్వాత ఎస్కో బార్‌ను కట్టడి చేయాలని అక్కడి ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేసింది. తన నేరస్వభావంతో వాటిని ఎదుర్కొన్నాడు. తనను ఎవరు టార్గెట్ చేశారో వారిని వేధించేవాడు. దేశ అధ్యక్ష స్థానానికి పోటీ పడే అభ్యర్థులను సైతం హత్య చేయించాడు. న్యాయవ్యవస్థను పూర్తిగా తన నియంత్రణలోకి తెచ్చుకునే వాడు. తనకు వ్యతిరేకంగా తీర్పులు వస్తే జడ్జీలను, ప్రాసిక్యూటర్లను బెదిరించేవాడు. ఆ దేశ సుప్రీంకోర్టును ధ్వంసం చేయడానికి పథక రచన చేశాడు. అందుకోసం తీవ్రవాదులకు డబ్బులు, ఆయు ధాలు, హెలికాప్టర్లు ఇచ్చి మరీ కాల్పులు జరిపించాడు. భయోత్పాతం సృష్టించాడు.

### న్యాయవ్యవస్థను భయపెట్టారు!

అదే పద్ధతిలో న్యాయవ్యవస్థను పరోక్షంగా ప్రభా వితం చేయడానికి, భయపెట్టడానికి జగన్ రెడ్డి కూడా కుట్ర పన్నారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తులపై ఇష్టానుసారంగా పోస్టులు పెట్టారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులను హైకోర్టు న్యాయమూర్తులపై ఉసిగొల్పారు. న్యాయమూర్తుల వ్యక్తిగత ప్రతిష్ఠలను హననం చేశారు. చివరకు సీబీఐ అధికారులను కూడా వదిలిపెట్టలేదు. వివేకానందరెడ్డి హత్య కేసు విచారిస్తున్న రామ్ సింగ్‌పై సైతం కేసు పెట్టారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యంను సైతం మానసిక క్షోభకు గురిచేసి బయటకు పంపారు. అమెరికా ఒత్తిడితో ఎస్కోబార్‌పై మిలటరీ ఆపరేషన్ చేశారు. అరెస్ట్ చేసిన తర్వాత కూడా ప్రత్యేక జైలు నిర్మించుకుంటానని చెప్పడంతో కొలం బియా ప్రభుత్వం సైతం ఒప్పుకుంది. సొంత జైలులో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నా డు. అక్కడి నుంచి కూడా తప్పించుకున్నాడు. దీంతో కొలంబియా పోలీసులు పట్టుకుని 1993లో కాల్చి చంపేశారు. అక్రమాస్తుల వ్యవహారంలో జగన్‌రెడ్డిపై 11 సీబీఐ కేసులు, 6 ఈడీ కేసులు ఉన్నాయి. ఆయా కేసుల్లో ఏ–1 గా ఉండి, 16 నెలలు జైలు జీవితం గడిపారు. జైలులో కూడా సర్వభోగాలు అనుభవిస్తూ తన ఆర్థిక, నేర సామ్రాజ్యాన్ని విస్తరింపజేశారు.

### పోలీసులను ఉసిగొల్పి వేలాది కేసులు..

ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతి భద్రతలు అదుపు తప్పాయి. హత్యలు, అత్యాచారాలు, బెదిరింపులు, గంజాయి, డ్రగ్స్ సరఫరా నిత్యకృత్యమయ్యాయి. ప్రతిపక్షాలను అణగదొక్కారు. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రిపై 17 అక్రమ కేసులు నమోదు చేశారు. చివరకు జైలుకు కూడా పంపి పైశాచికానందం పొందా రు. జగన్ పాలనలో 300 మంది బీసీలను హత్య చేశారు. ఎస్సీలపై 10,377 నేరాలు, మహిళలపై 89,875 నేరాలు జరిగాయి. 700 మంది టీడీపీ కార్యకర్తలను హత్య చేశారు. పోలీసులను చెప్పుచేతల్లో పెట్టుకుని వేలాది తప్పుడు కేసులు పెట్టారు. ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నేతలు, న్యాయమూర్తులు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరినీ వేధించారు. సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణంరాజును పోలీస్ స్టేషన్‌లోనే చావబాదారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను వేధించి చనిపోయేలా చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కుట్రకు పథక రచన చేశారు.

### వ్యవస్థల నియంత్రణలో నంబర్ వన్!

అన్ని వ్యవస్థలను బెదిరించడం, భయపెట్టడం ద్వారా నియంత్రణలోకి తెచ్చుకోవడంలో పోలికలు ఉన్నాయి. ధనవంతుల వద్ద డబ్బు కొట్టేసి పేదవారికి పంచే రాబిన్ హుడ్ ఇమేజ్ ఎస్కోబార్‌కు ఉండేది. పేదల కోసం ఎస్కోబార్ డబ్బులు వెదజల్లేవాడు. జగన్ రెడ్డి కూడా పేదల కోసం ఉచితాలు అని కొన్ని పథకాలు ప్రవేశపెట్టారు. ప్రజల డబ్బును ఆయాచితంగా దోచిపెట్టారు. అభివృద్ధిని గాలికి వదిలేశారు. ఇసుక, మద్యం, వివిధ కాంట్రాక్ట్‌లు అన్ని, తాను తన చుట్టూ ఉన్నవారు మాత్రమే చేసుకుంటూ రెండు చేతులా యథేచ్ఛగా దోపిడీ చేశారు. ఎస్కోబార్ కూడా అంతే. పార్లమెంట్ సభ్యుడిగా పనిచేస్తున్నప్పుడు ఎస్కోబార్ చేస్తున్నటువంటి దాష్టీకాలు చూసి ఆ దేశ పార్లమెంట్ అతడిని అనర్హుడిగా ప్రకటించింది. జగన్ రెడ్డి అంతకంటే ఎక్కువ నేరాలు–ఘోరాలు చేశారు. కానీ అతడిని అనర్హుడిగా ప్రకటించలేదు. పైగా ఎలాంటి చర్యలు కూడా తీసుకోలేదు. ఎస్కోబార్‌కు వ్యతిరేకంగా ఆ దేశ ప్రజలు పెద్దపోరాటమే చేశారు. జగన్ రెడ్డిని కూడా తాజా ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తిరస్కరించారు. ఎస్కోబార్‌కు జగన్ రెడ్డికి పోలికలు ఉన్నా యని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# క్రీమీలేయర్ కావాలని ఎవరడిగారు



న్యాయ శాస్త్ర నిబంధన. ఈ నిబంధన ప్రకారమే కోర్టులలో విచారణ సాగాలి, తీర్పులు ఇవ్వాలి అంటూ.. సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని ఆర్డర్14 నిర్దేశిస్తున్నది. స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ అనే కేసు సుప్రీంకోర్టు ముందు విచారణకు వచ్చింది. వివాదిత అంశం ఎస్సీ కులాల వర్గీకరణ కోసం మాత్రమే. వర్గీకరణ చేయడానికి అనుమతించాలంటూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తే, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వైరి పక్షం వారు వాదించారు. ఇరువురి వాదనలో ఏది సమంజసమో మాత్రమే సుప్రీంకోర్టు తేల్చిచెప్తే సరిపోయేది.

ఎస్సీ వర్గంలోని వివిధ కులాల మధ్యన సైతం అంతరాలు ఉన్నాయని, అభివృద్ధిలో తేడాలు ఉన్నాయని చెబుతూ క్రీమీలేయర్‌ను ముందుకు తీసుకొచ్చారు. ఎస్సీ కులాల మధ్య అంతరాలు లేవని ఎవరూ వాదించడం లేదు. ఆ చేదు వాస్తవాన్ని అంబేద్కర్ సైతం అంగీకరించారు. వారందరూ అంటరానివారుగా బతికినా.. వారి మధ్యన సైతం ఎన్నో అంతరాలు ఉన్నాయని, వివక్ష సైతం ఉన్నదని ఆయన ఆనాడే గుర్తించాడు. అయితే ఈ అంతరాలను పుట్టించి, అమలు పరిచిన పాపం ఎవరిదనే మౌలిక ప్రశ్నను ఆయన వేశారు. ఈ నెల ఒకటిన కీలక తీర్పును వెలువరించిన సుప్రీంకోర్టు, రాష్ట్రాల వారీగా ఎస్సీ కులాల వర్గీకరణకు అనుమతినిచ్చింది. ఊహించిన విధంగానే, సుప్రీం తీర్పు భిన్న స్పందనలకి దారితీసింది. ముప్పై సంవత్సరాలుగా నానుతున్న ఒక సమస్యకు పరిష్కారం లభించిందని కొందరు స్వాగతిస్తే, ఈ సమస్యను పరిష్కరించడం తక్కువ, కొత్త సమస్యలకు తెర తీయడం ఎక్కువ జరిగిందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగంలో పొందుపరచబడిన సామాజిక న్యాయ సూత్రాలను నిర్వీర్యపరచాలని చూస్తున్న స్వార్థపరశక్తులకు ఊతమిచ్చే విధంగా తీర్పులోని అంశాలున్నాయనేది సామాజిక న్యాయ ఉద్యమకారుల ఆవేదన.

### వర్గీకరణ సమంజసమంటూనే..

వ్యాజ్యంలోఇరుపక్షాలు లేవనెత్తినఅంశాలపైననే తీర్పుని వ్వాలనేది కానీ వర్గీకరణే సమంజసమని గౌరవ కోర్టు తీర్పునిస్తూనే ఆశ్చర్యకరంగా.. అంతటితో ఆగిపోకుండా, ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో క్రీమీలేయర్ నిబంధనను సైతం అమలుపరచాలంటూ తీర్పునిచ్చారు. దీంతో అవాంఛనీయ వివాదాలకు తెరతీసినట్టు అయింది. వర్గీకరణ కావాలని కోరుతున్న వారు వివిధ కులాల మధ్య అంతరాలు ఉన్నవి కాబట్టి ఏకరూప వర్గాన్ని వివిధ తరగతులుగా విభజించి, సదరు తరగతుల వాటాను నిర్ణయించి, సమన్యాయం అందించాలని కోరారు తప్ప.. మాకు లేదా ఎదుటిపక్షం వారికి క్రీమీలేయర్ విధించండి అంటూ ఎవరూ కోరలేదు. అసలు క్రీమీలేయర్ అంశాన్ని తీర్పులో ప్రస్తావించే వరకు సైతం.. న్యాయ ప్రక్రియలో భాగస్వాములైన వారికి కనీసపు దానిపై ఎరుక లేదు.

### క్రీమీలేయర్ నిబంధన రాజ్యాంగ విరుద్ధం!

కనీసం ఈ అంశంలో న్యాయం చేయడం కోసం క్రీమీలేయర్‌ను సైతం మేము పరిశీలిస్తున్నామని జడ్జీలు చెప్పి ఉంటే.. హాజరైన న్యాయవాదులు తమ వాదనలు సమర్పించి ఉంటే అది కొంతమేరకు సమంజసమై ఉండేది. ఎవరూ కోరనిది, ఎవరూ వాదించనిది తీర్పులో చోటు చేసుకోవడమనేది ఏ రకంగానూ సమంజసం కాదు, న్యాయబద్ధమూ కాదు. న్యాయ శాస్త్ర పరిభాషలో ఇలాంటి ఆదేశాలను infructuous అంటారు. దాని అర్థం అమలుచేయ వీలులేనివి. తమ ఒక్క మాటే శాసనంగా చలామణి అవుతుందని గౌరవ న్యాయమూర్తులు గుర్తించి ఉండాల్సింది. ప్రస్తుతం ఓబీసీ వర్గాలకు అమలవుతున్న క్రీమీలేయర్ నిబంధన సైతం రాజ్యాంగ విరుద్ధమే. రాజ్యాంగంలో కానీ, మండల్ కమిషన్ సిఫారసుల్లో కానీ క్రీమీలేయర్ ప్రస్తావనే లేదు. ఇంద్ర సాహ్నీ కేసులో ఇవ్వబడిన తీర్పు కారణంగా ఈ క్రీమీలేయర్ విధానం ముందుకు వచ్చింది. క్రీమీలేయర్ కారణంగా ఇప్పటికే ఓబీసీ వర్గాలు చాలా నష్టపోతున్నాయి. 60 శాతం వరకు జనాభా ఉన్న ఓబీసీ వర్గాలకు 27% రిజర్వేషన్లు నిర్ణయించినా.. నేటి వరకు సగటున ఓబీసీలకు దక్కింది 8 శాతం మాత్రమే. మండల్ కమిషన్ అమలై 30 ఏళ్లు దాటాక, ఇంకా ఇంత తక్కువ ఓబీసీ ప్రాతినిధ్యం ఏమిటని ప్రశ్నిస్తే.. నాట్ ఫౌండ్ సూట బుల్ అనే సాకుని అధికార వర్గాలు ముందుకు తీసుకొస్తున్నాయి. క్రీమీ లేయర్, నాట్ ఫౌండ్ సూటబుల్ అనేవి నేటి కాలపు పురుష సూక్తంగా పనిచేసి.. ఆధునిక మనువ్యవస్థను కాపాడుతున్నాయి.

### కుల నిర్మూలన పరిష్కారమంటూ..

ఎస్సీ వర్గంలోని వివిధ కులాల మధ్యన సైతం అంత రాలు ఉన్నాయని, అభివృద్ధిలో తేడాలు ఉన్నాయని తెలుపుతూ క్రీమీలేయర్‌ను ముందుకు తీసుకొచ్చారు. ఎస్సీ కులాల మధ్య అంతరాలు లేవని ఎవరూ వాదిం చడం లేదు. ఆ చేదు వాస్తవాన్ని అంబేద్కర్ సైతం అంగీకరించారు. మహారాష్ట్రలోని మహర్, మాంగ్, చంభార్, ఢోర్ కులాల వారందరూ అంటరానివారుగా బతికినా.. వారి మధ్యన సైతం ఎన్నో అంతరాలు ఉన్నా యని, వివక్ష సైతం ఉన్నదని ఆయన ఆనాడే గుర్తించారు. అయితే ఈ అంతరాలను పుట్టించి, అమలు పరిచిన పాపం ఎవరిదనే మౌలిక ప్రశ్న ఆయన వేశాడు. అగ్రవర్ణాలు సృష్టించిన నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఈ అంతరాలకు పునాది అంటూ ఆయనే తన పరిశోధనలో తేల్చి చెప్పాడు. అంబేద్కర్ ఒక గొప్ప సామాజిక శాస్త్రవేత్త. ఆయన పరిశోధించి తేల్చిన అంశాలను ఎవరైనా పరిశీలించి నిగ్గు తేల్చవచ్చు. కొందరు తమ స్వార్థం కోసం సృష్టించిన అమానవీయ, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థయే ఈ అంతరాలన్నిటికీ కారణమని తేల్చి చెప్పిన ఆయన.. కుల నిర్మూలనే ఈ జబ్బుకు పరిష్కారం అని రోగనిర్ధారణ సైతం చేశారు. ఆయన పరిశోధనా గ్రంథం 'కుల నిర్మూలన' (అన్నిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్) నేటి మన సమస్యలకు ప్రిస్క్రిప్షన్ అందిస్తుంది. రాజ్యాంగ నిర్మాత ఆశించిన కుల నిర్మూలన వైపు నిర్మాణాత్మకంగా అడుగులువేయండి అం టూ అధికార వర్గాలను ఆదేశించాల్సిన చోట.. సామాజిక న్యాయ విరుద్ధ క్రీమీలేయర్ ప్రస్తావన తీసుకురావడం రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమే. గౌరవ న్యాయమూర్తులు సుమోటోగా సమీక్ష నిర్వ హించి, అవాంఛిత అంశాలను తీర్పు నుండి తొలగించి, న్యాయాన్ని నిలబెట్టాలని.. సామాజిక న్యాయ ఉద్యమకారులు కోరుతున్నారు.

# గెస్ట్ ఫ్యాకల్టీ గెంటివేతేనా!

ప్రభుత్వాలు తమ అవసరాల కోసం తక్కువ వేతనాలకు లభించే మానవ వనరులను వాడుకుని తర్వాత వారిని వదిలేయడం ఈ మధ్య కాలంలో పరిపాటిగా మారింది. ఇందుకు ఉదాహరణ గత కొద్ది రోజులుగా వివిధ ప్రభుత్వ కళాశాలలో, గురుకుల విద్యా సంస్థల్లో శాశ్వత నియామకాలను చేస్తూ కొత్త జూనియర్, డిగ్రీ లెక్చరర్లను తీసుకుంటున్నాయి. దీంతో ఇప్పటి వరకు అక్కడ ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న గెస్ట్, హవర్లీ బేసిక్ లెక్చరర్లు, ఇతర ఉద్యోగులు వేల సంఖ్యల్లో రోడ్డు మీద పడుతున్నారు. గురుకుల విద్య సంస్థలలోని మొత్తం ఉద్యోగాల సంఖ్యకు అనుగుణంగా పర్మినెంట్ వారిని తీసుకోవడంతో గత ఎనిమిది సంవత్సరాలుగా అక్కడే పనిచేస్తూ, దానినే జీవనాధారంగా చేసుకున్న సుమారు మూడు వేల మంది ఉద్యోగాలను కోల్పోతున్నారు. నిజానికి గురుకుల విద్యాసంస్థలు ప్రారంభమైన నాటి నుండి అరకొరగా ఉన్న రెగ్యులర్ సిబ్బందితో వీరు పోటీ పడి విద్యాసంస్థల అభివృద్ధికై అహర్నిశలు కృషి చేశారు. అన్నింటికంటే దారుణమైన విషయం ఇన్నేళ్లు అక్కడ పని చేసినందుకుగాను కనీసం సర్వీస్ సర్టిఫికెట్ అడిగితే కూడా ఇవ్వకపోవడం అత్యంత శోచనీయం. ప్రభుత్వాలే గెస్ట్ లెక్చరర్లను వాడుకుని ఇప్పుడు మధ్యలో వదిలేస్తే వారికి దిక్కెవరు? రాష్ట్ర ప్రభుత్వం వివిధ జూనియర్, డిగ్రీ, గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న సుమారు ఐదువేల మంది గెస్ట్ ఫ్యాకల్టీని మానవతా దృక్పథంతో ఆదుకోవాలి.

ఉన్నపళాన టెర్మినేట్ చేస్తే...

రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత పదేళ్లుగా 1654 మంది గెస్ట్ ఫ్యాకల్టీ (అతిథి అధ్యాపకులు) విధులు నిర్వహిస్తున్నారు. అలాగే 153 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ సుమారు 1300 మంది గెస్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు. ప్రభుత్వం వీరందరి సర్వీస్‌ను ఈ అకడమిక్ ఇయర్ రెన్యువల్ చేయకుండా నాన్చివేత ధోరణిని అవలంబిస్తోంది. జూనియర్ లెక్చరర్‌లకు కేవలం ఒక్క నెలకు మాత్రమే రెన్యువెల్ ఇచ్చి చేతులు దులుపుకుంది. వీరే కాకుండా రాష్ట్రంలోని వివిధ రకాల గురుకుల విద్యా సంస్థలన్నింటిలో కలిపి సుమారు మూడు వేల మంది గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. ఈ సంస్థలలో పనిచేస్తున్న వారందరిని ఉన్నపళంగా రాష్ట్ర ప్రభుత్వం టెర్మినేట్ ఉత్తర్వులు జారీ చేసి ఇంటికి పంపించేస్తుండటం బాధాకరం.

పదేళ్ల బోధనకు ఫలితం ఇదా?

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత విద్యాభివృద్ధికై అనేక రకాల రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను స్థాపించడం జరిగింది. అంతకు ముందు రాష్ట్రంలో కేవలం 298 రెసిడెన్షియల్ విద్యాసంస్థలు కలవు. నేడు వాటి సంఖ్య 1002కు చేరుకుంది. వీటన్నింటి సంఖ్యను దశల వారీగా పెంచుతూ, కొత్తగా ప్రారంభించిన వాటిలో ముందుగా పర్మినెంట్ ఉద్యోగులను నియామకం చేయాలి. కానీ అలా చేయ కుండా ఆనాటి ప్రభుత్వ పరిస్థితులకు అనుగుణంగా కాంట్రాక్టు, గెస్ట్ పద్ధతిన టీచర్‌లను, లెక్చరర్‌లను తీసుకుని నిర్వహించుకుంటూ రావడం జరిగింది. ఇందులో కాంట్రాక్టు పద్ధతి న నియామకమైన కొద్దిమందిని గతంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రెగ్యులర్ చేయడం జరిగింది. అలా రెగ్యులర్ అయిన వారి సంఖ్య వందల్లో ఉంటుంది. ఇక వారి కంటే రెండు, మూడింతల ఎక్కువ సంఖ్యలో గెస్ట్ ఫ్యాకల్టీనే ఈ సంస్థలలో పని చేస్తున్నారు.

సర్వీస్ సర్టిఫికెట్ కూడా ఇవ్వకుండా...

గతంలో ఈ సంస్థలకు సంబంధించిన పర్మినెంట్ ఉద్యోగ నోటిఫికేషన్‌లు 2017, 19లలో ప్రభు త్వం జారీ చేసింది. ఉద్యోగ పరీక్షల నిర్వహణ అనంతరం రెగ్యులర్ సిబ్బందిని అక్కడ నియమించారు. అయితే అప్పటికే ఆ స్థానాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, గెస్ట్ సిబ్బందిని ఇతర విద్యా సంస్థలకు సర్దుబాటు చేయడం వలన అప్పుడు ఎలాంటి సమస్య తలెత్తలేదు. ఇప్పుడు మాత్రం గురుకుల విద్య సంస్థలలోని మొత్తం ఉద్యోగాల సంఖ్యకు అనుగుణంగా పర్మినెంట్ వారిని తీసుకోవడంతో గత ఎనిమిదేళ్లుగా అక్కడే పని చేస్తూ, దానినే జీవనాధారంగా చేసుకున్న సుమారు మూడు వేల మంది ఉద్యోగాలను కోల్పోతున్నారు. నిజానికి గురుకుల విద్యా సంస్థలు ప్రారంభమైన నాటి నుండి అరకొరగా ఉన్న రెగ్యులర్ సిబ్బందితో వీరు పోటీపడి విద్యా సంస్థల అభివృద్ధికై అహర్నిశలు కృషి చేశారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాలతో పాటు, అత్యు న్నత సంస్థలు అయిన ఐఐటీ, నీట్, ట్రిపుల్ ఐటీ, మెడికల్ రంగాల్లో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడంలో వారి పాత్ర అమోఘం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై ఎల్లవేళలా అందుబాటులో ఉండి అన్ని తామై చూసుకున్నారు. జీతాలు సక్రమంగా సమయానికి రాకపోయినా నిజాయితీగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. అన్నింటి కంటే దారుణమైన విష యం ఇన్నేళ్లు అక్కడ పని చేసినందుకుగాను కనీసం సర్వీస్ సర్టిఫికెట్ అడిగితే కూడా ఇవ్వకపోవడం అత్యంత శోచనీయం.

ప్రభుత్వాలే వాడుకుని వదిలేస్తే దిక్కెది?

ఒకప్పుడు శ్రమదోపిడి అజ్ఞానం, అమాయకత్వాలను ఆసరాగా తీసుకుని కొనసాగించేవారు. కానీ ప్రస్తుతం అన్నీ తెలిసి కూడా యువత ఈ ఉచ్చు లోకి లాగబడుతున్నారు. దీనికి ప్రధాన కారణం నిరుద్యోగ సమస్య, పేదరికం, శాశ్వత ఉద్యోగ నోటిఫికేషన్‌లు సకాలంలో రాకపోవడం వంటివి వారిని దిక్కుతోచని స్థితిలో నెట్టివేస్తున్నాయి. ఎటూ పాలుపోకుండా చివరికి ఈ తాత్కాలిక ఉద్యోగాల వైపు రావడం, వాటిల్లో జాయిన్ కావడం జరిగింది. జరుగుతోంది. అయితే ఇప్పుడు కొత్తగా ప్రభుత్వాలే వాడుకుని వదిలేస్తే వారికి దిక్కెవరు? భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వాలే శ్రమ దోపిడీ కొనసాగిస్తే ఇక వారిని కాపాడేదెవరు?

సర్వీస్ రెన్యువల్ చేయాల్సిందే!

గత ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచడం జరిగిం ది. అంతేగాకుండా వారి జీతం సైతం 42,000 వరకు పెంచుతామని పేర్కొంది. గెస్ట్ ఫ్యాకల్టీకి అవసరమైతే ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ కూడా ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం అది ఎక్కడా కనబడటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ జూనియర్, డిగ్రీ, గురుకుల విద్యా సంస్థలలో పనిచేస్తున్న సుమారు ఐదువేల మంది గెస్ట్ ఫ్యాకల్టీని మానవతా దృక్పథంతో ఆదుకోవాలి. వారందరిని అవసరం ఉన్నచోట నియామకం చేస్తూ వారి సర్వీస్‌లను రెన్యువల్ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత గౌరవ ముఖ్యమంత్రి, వారి ప్రభుత్వంపైన ఉంది.

## అంగన్ వాడీ టీచర్లకు 2 లక్షలు, ఆయాలకు లక్ష..

# సీతక్క అదిరిపోయే న్యూస్



హైందరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీలకు గుడ్ న్యూస్ చెప్పింది. తాజాగా కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణలో ప్రత్యేకంగా అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు మంత్రి సీతక్క. మహిళా శిశు సంక్షేమ శాఖ అవసరాలను కేంద్రం ముందుంచిన సీతక్క ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త అంగన్ వాడి సెంటర్లను మంచేసారు జూరు చేయావిజ్ఞప్తి సీతక్క.లని కేంద్రాన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో టీచర్లకు కొత్త ట్యాబ్ లు ఇవ్వాలని కోరింది సీతక్క. అంగన్ వాడీ కేంద్రాల్లో నర్సీరీ క్లాస్ లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి మరింత సహాకారం అవసరం అని పేర్కొంది. 3989 మిని అంగన్ వాడీలను మెయిన్ అంగన్ వాడీలకు గా మార్చాం. అక్కడ టీచర్లకు ట్రెయినింగ్ ఇచ్చి మెరుగైన సేవలు అందిస్తున్నాం. రిటైర్ అవుతున్న అంగన్ వాడీ టీచర్లకు 2 లక్షలు, ఆయాలకు లక్ష రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వబోతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు.

## టైం చూసి దెబ్బ కొట్టిన ఏపీ మాజీ సీఎం జగన్..

# దేశవ్యాప్తంగా చర్చ...



అమరావతి: వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి తీసుకున్న స్టాండ్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పార్లమెంట్ వేదికగా ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు.. వక్ఫ్ చట్టం సవరణను వైసిపి తీవ్రంగా వ్యతిరేకించింది. తెలుగుదేశం పార్టీ ఈ బిల్లుకు మద్దతు ప్రకటించింది.. ఈ సవరణ బిల్లు మీద ఎలాంటి కసరత్తు చేయకుండానే బిజెపి లోక్సభలో ప్రవేశపెట్టిందట.. కనీసం తటస్థ పార్టీల సైతం సంప్రదించలేదు. మహారాష్ట్ర హర్యానా అసెంబ్లీలకు ఈ ఏడాది జరగాల్సిన ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్రం వక్ఫ్ చట్టం సవరణ బిల్లును లోక్సభలో ప్రవేశపెట్టింది.. తటస్థ పార్టీలు కూడా ఈ సవరణ బిల్లుకు మద్దతు ప్రకటిస్తాయని బిజెపి భావించింది.. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ముస్లింల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు లోక్సభలో మిథున్ రెడ్డి ప్రకటించారు.. వైసిపి తీసుకున్న ఏ నిర్ణయం జాతీయస్థాయిలో కొత్త చర్చకు దారితీస్తోంది.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో.. జగన్మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీతో సన్నిహితంగా ఉండేవారు.. ఏపీకి నిధుల విషయంలో కూడా పలుమార్లు ఆయన మోడీని కలిశారు.. అయితే ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత. వారిద్దరి మధ్య గ్యాప్ పెరిగింది అనే ప్రచారం జరుగుతుంది.. ఈ క్రమంలోనే జగన్మోహన్ రెడ్డి బిజెపికి దూరమై.. ఇండియా కూటమికి దగ్గరవుతున్నారనే చర్చ జాతీయ స్థాయిలో నడుస్తోంది.. అందులో భాగంగానే వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వైసీ వ్యతిరేకించిందట. వైసీపీ బలం ఏంటో టైం చూసి జగన్మోహన్ రెడ్డి నరేంద్ర మోడీకి చూపెట్టారని కూటమి పార్టీలు భావిస్తున్నాయి. ఏపీలో అధికారం కోల్పోయిన జాతీయ స్థాయిలో తమ పార్టీ హవా ఏ మాత్రం తగ్గలేదనే సంకేతాన్ని జగన్మోహన్ రెడ్డి మోడీకి పంపారని కామెంట్స్ వినిపిస్తున్నాయి.. ఇండియా కూటమి వైపు జగన్ మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని అందుకే బిజెపి ప్రవేశపెట్టిన ఈ బిల్లుని వ్యతిరేకించారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.. వైసిపి మాత్రం ముస్లింల మనోభావాలను దెబ్బతీసే ఏ బిల్లుకుతావో మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేస్తుంది..

# అందుకే హరీష్ రావును మంచి లీడర్ అన్నాను



హైదరాబాద్: బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే ప్రసక్తే లేదన్నారు కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ను ఎదుర్కొనే శక్తి బీజేపీకి కేడర్కు ఉంది. తెలంగాణలో అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ భారీ స్థాయిలో వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. కాగా, బండి సంజయ్ శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్చాట్లో మాట్లాడుతూ..'సీఎం రేవంత్ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. కేటీఆర్ను కచ్చితంగా జైలులో వేస్తారు. ఒకవేళ కేటీఆర్ను జైల్లో పెట్టకపోతే బీజేపీ నుంచి పెద్ద యుద్ధమే ఉంటుంది. బీఆర్ఎస్ పాలనను మా కేడర్ మరిచిపోదు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనే ప్రసక్తే లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ను ఎదుర్కొనే శక్తి బీజేపీ కేడర్కు ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వస్తే బీజేపీనే ఇప్పించిదనే ప్రచారం చేస్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను యూరప్ దేశాలకు కాదు.. బంగ్లాదేశ్కు పంపించాలి. మేడిగడ్డ మీద ఫిర్యాదు వచ్చింది. దీన్ని ఎన్డీఎస్ఏ పరిశీలించింది. సుంకిశాలపై కూడా ఫిర్యాదు వస్తే కచ్చితంగా కేంద్రం పరిశీలిస్తుంది. నిజాయితీగా పనిచేసే అధికారులకు కాంగ్రెస్ పోస్టింగ్ ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన వారికే మళ్లీ పోస్టింగ్ ఇస్తున్నారు. నిజంగా బీఆర్ఎస్కు సపోర్ట్ చేసిన వాళ్ళే మంచి పోస్టింగులు తెచ్చుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ప్రజల నుంచి కాంగ్రెస్ వ్యతిరేకత మూటకట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుంది. బీజేపీకి ప్రచారం చేసేది మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలే. కేంద్రమే నిధులు ఇస్తుందని మాజీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తెలుసు. కేంద్రం నిధులు ఇస్తుందని హరీష్ రావు చెప్తున్నారు కాబట్టే.. ఆయన మంచి లీడర్ అన్నాను. ముచ్చర్ల చుట్టూ ఎన్ని భూములు కొట్టేశారో అందుకే ప్రభుత్వం అక్కడ ఫోర్త్ సిటీ అంటున్నారు. సొంత వ్యవహారాల కోసమే విదేశాలకు అప్పుడు బీఆర్ఎస్ పెద్దలు వెళ్ళారు.. ఇప్పుడు రేవంత్ వెళ్ళారు.. దీంట్లో తేడా ఏమీ లేదు. రోహింగ్యాలకు సంబంధించి ఇప్పుడు ఒక అసోసియేషన్ ఏర్పడింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో నేను మాట్లాడితే కేసీఆర్, కేటీఆర్ హేళన చేశారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఎన్ని వక్ఫ్ భూములు కాపాడారు?. లోక్సభ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక ఓట్లు వచ్చిన పోలింగ్ బూతు కమిటీలకు సన్మానం చేస్తాం. కరీంనగర్లో ఆగస్టు 15వ తేదీ తర్వాత కార్యక్రమం ప్రారంభమవుతుంది. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి ఇస్తారో తెలియదు. దీనిపై బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది' అంటూ కామెంట్స్ చేశారు.

# తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణం.

# కేంద్ర మంత్రి రామ్మోహన్ కీలక ప్రకటన !

హైదరాబాద్ : తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణం ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ఇతర ఎయిర్ పోర్టుల నిర్మాణానికి మేము ప్రణాళికలు రెడీ చేస్తున్నాం..త్వరలోనే వివరాలు వెల్లడిస్తాను అని వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ జీఎంఆర్ అరేనాలో 2%అం% ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ %-% 2024 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్ పోర్ట్ ఉన్నతాధికారులు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. సెంట్రల్ మినిస్టర్ అయ్యాక హైదరాబాద్ లో తొలి ఈవెంట్ కు హాజరయ్యాను.. ఇది నాకు మర్చిపోని రోజు అన్నారు. 2014 కు ముందు తరువాత ఏవియేషన్ లో అనేక వచ్చాయి..చంద్రబాబు నాయుడు ఆలోచనతో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మించబడిందని వెల్లడించారు. దేశంలో నాల్గవ అతిపెద్ద ఎయిర్ పోర్ట్ గా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ఉంది..ఎందు కు ఇంత పెద్ద ఎయిర్ పోర్ట్ అన్నారు.. వరల్డ్ లోనే టాప్ 10 ఎయిర్ పోర్ట్స్ సరసన నిలిచిందని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎయిర్ పోర్ట్స్ నిర్మాణానికి.. అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ప్రకటించారు.

# కాంగ్రెస్‌లోకి నెక్స్ట్ అతనే.సిగ్నల్ ఇచ్చేశారుగా





హైదరాబాద్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారనే ప్రచారం తెలంగాణలో జోరుగా వినిపిస్తోంది. కారు దిగేస్తున్న ఎమ్మెల్యేల సరసన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తహతహ లాడుతున్నట్లు సయాచారం. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బోథ్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచారాయన. ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో అనిల్ తలమునకలైఉన్నారు. గత కొంతకాలంగా ఆయన గులాబి పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతున్నా%ౌ% ఇప్పుడు ఆ ప్రచారం నిజమని నమ్మాల్సి వస్తోందంటున్నారు విశ్లేషకులు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వ్యవహరించిన తీరు%ౌ%ఆ ప్రచారాన్ని బలపరుస్తున్నాయి. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పరిధిలోని పిప్రి గ్రామంలో పర్యటించారు. ఈ సభలో కాంగ్రెస్ నేతలతో పోటీపడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేలా ప్రసంగించారు. ఈ ప్రసంగంతో అనేక ఊహాగానాలు తెరలేపింది. డిప్యూటీ సీఎం ఆశీస్సులు ఉండాలనే స్థాయిలో పెర్ఫార్మెన్స్ చేయడమే పొలిటికల్ సర్కిల్స్లో హాట్ డిబేట్కు తెరలేపింది. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కాంగ్రెస్ పార్టీతో పాటు.. ఆ పార్టీలోని కొందరు నేతలతో విడదీయరాని అనుబంధం ఉంది. 2004లో తెలంగాణ ఉద్యమ సమయంలో టి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్ జాదవ్ పనిచేశారు. అనంతరం టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2009, 2014 ఎన్నికల్లో బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2018లో కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం 2019లో మళ్లీ టీ.ఆర్.ఎస్ గూటికి చేరి నేరడిగొండ జడ్పీటీసీగా విజయం సాధించారు. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు అనిల్ జాదవ్. అయితే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారిపోయాయి. బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో ఒక్కొక్కరుగా చేరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో పాటు ఆసిఫాబాద్ నుండి గెలుపొందిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ కూడా పార్టీ మారుతారని జోరుగా ప్రచారం జరగ్గా ఇప్పుడు అనిల్ జాదవ్ వ్యవహారశైలిని చూస్తే నెక్ట్స్ లిస్టులో ఉన్నది ఆయనే అన్నది విశ్లేషకులు చెప్తున్న మాట. విపక్షానికి చెందిన ఎమ్మెల్యే డిప్యూటీ సిఎం భట్టిని తెగ పొగిడేయడం వెనుక రీజనేంటి? అని తెగ ఆశ్చర్యపోయారట చూసినవారంతా. అటు కాంగ్రెస్ నేతలు సైతం ఎమ్మెల్యే అనిల్ వైఖరితో జుట్టుపీకేసుకున్నారట. తాను మాత్రం గాంధీభవన్ వైపు వెళ్తాననే సిగ్నల్ ఇచ్చేశారు అనిల్. విదేశీ పర్యటన నుంచి ముఖ్యమంత్రి తిరిగి వచ్చేశాక ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు అనిల్ సిద్ధమవుతున్నారని టాక్ నడుస్తోంది. ఈలోపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లైన్ క్లియర్ చేస్తారని అంటున్నారు. స్థానిక కాంగ్రెస్ నేతలు వ్యతిరేకిస్తున్నా ఆయన్ని చేర్చుకునేందుకు కాంగ్రెస్ పెద్దలు సిద్ధమైపోయారు. మరి రేవంత్ వచ్చాక పరిస్థితి ఏంటన్నది వేచి చూడాలి. మొత్తానికి బీఆర్ఎస్ నుంచి 11వ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు.

# బంగ్లాదేశ్ సరుకులు తీసుకుంది, డబ్బులు చెల్లించలేదు, అది కూడా 1200 కోట్లు, గుజరాత్‌లో కలకలం రేపింది



న్యూఢిల్లీ . బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస గుజరాత్‌లోని వ్యాపారులు మరియు వ్యాపారులకు పెద్ద దెబ్బ ఇచ్చింది. బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాకాండతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం నిలిచిపోయిన కారణంగా ?1,200 కోట్ల విలువైన గుజరాత్ వ్యాపారవేత్తలు చిక్కుకుపోయారు. ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి, దేశంలో విస్తృత నిరసనల తర్వాత తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, బంగ్లాదేశ్‌లో పరిస్థితి సాధారణమై వాణిజ్యం తిరిగి ప్రారంభమవుతుందని భారతీయ వ్యాపారవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రియాక్టివ్ రంగులు, రసాయనాలు, పిగ్మెంట్ పేస్ట్, చేనేత ఉత్పత్తులు, %ూా×%లు, మందులు మరియు టైల్స్ గుజరాత్ నుండి బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేయబడతాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరియు ఐరోపాలో మాంద్యం తర్వాత, బంగ్లాదేశ్ రంగులు, రసాయనాలు మరియు మధ్యవర్తుల వంటి వస్తువులకు ముఖ్యమైన మార్కెట్‌గా మారడం గమనార్హం. కానీ, బంగ్లాదేశ్‌లో హింస మరియు ప్రభుత్వ మార్పు మరోసారి వ్యాపారానికి గ్రహణం పట్టింది. ప్రస్తుతం అక్కడ భారత వ్యతిరేక సెంటిమెంట్ కారణంగా బంగ్లాదేశ్ బ్యాంకులు జారీ చేసిన క్రెడిట్ లెటర్లను గౌరవించడం లేదని గుజరాతీ వ్యాపారవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

వాణిజ్యం విలువ 14 బిలియన్ డాలర్లు:

అహ్మదాబాద్ మిర్రర్‌లోని ఒక నివేదిక ప్రకారం, 2023లో భారతదేశం మరియు బంగ్లాదేశ్ మధ్య 14 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని గుజరాత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అధ్యక్షుడు శైలేష్ పట్వారీ చెప్పారు. ఇందులో భారతదేశం 12.2 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసింది మరియు 1.8 బిలియన్ డాలర్లు దిగుమతి చేసుకుంది. ఈ సంవత్సరం వాణిజ్యం మరింత పెరుగుతుందని అంచనా వేయబడింది, కానీ ఇప్పుడు బంగ్లాదేశ్‌లో రాజకీయ గందరగోళం కారణంగా అది మరుగునపడింది.

అయితే త్వరలో పరిస్థితి చక్కబడుతుందని కొందరు వ్యాపారులు కూడా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లాదేశ్ కంపెనీలు సాధారణంగా 15 రోజులు మాత్రమే స్టాక్ ఉంచుతాయని ఆయన చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. భారత్‌పై అధికంగా ఆధారపడటం వల్ల బంగ్లాదేశ్ త్వరలో వాణిజ్యాన్ని ప్రారంభించవలసి ఉంటుంది. బంగ్లాదేశ్‌లో అల్లకల్లోలం కారణంగా సూరత్ వస్త్ర వ్యాపారానికి పెద్ద దెబ్బ తగిలింది . దాదాపు రూ.500 కోట్ల వస్త్ర వ్యాపారం దెబ్బది తిన్నది. గతేడాసూరత్ నుంచి బంగ్లాదేశ్‌కు రూ.1200 కోట్ల విలువైన బట్టలు ఎగుమతి అయ్యాయి. సూరత్ నుంచి ప్రతినెలా రూ.500 కోట్లకు పైగా వస్త్రం కోల్‌కతాకు వెళుతుంది. ఇందులో 50 శాతం అంటే రూ.250 కోట్ల విలువైన వస్తువులు బంగ్లాదేశ్‌కు చేరుతున్నాయి. సూరత్ నుండి దాదాపు 700 మంది వ్యాపారులు కోల్‌కతా మీదుగా బంగ్లాదేశ్‌తో వ్యాపారం చేస్తారు. 100 కోట్లకు పైగా వారి చెల్లింపు నిలిచిపోయింది.

# అరచేతిలో అపార సౌర శక్తి

## బుల్లి సౌర ఫలకం!

## వెంట్రుక కన్నా 100 రెట్లు పలుచన

## సెల్ ఫోన్‌ను ఇట్టే చార్జ్ చేసుకోవచ్చు

## ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టుల ఆవిష్కారం




ఒకవైపు ఇంధన అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి.

సంప్రదాయ ఇంధన వనరుల ఉత్పత్తి అంతులేని కాలుష్యానికి, గ్లోబల్ వార్మింగ్ పెనుభూతానికి కారకంగా మారుతోంది. సౌర విద్యుత్ సమర్థ ప్రత్యామ్నాయంగా కన్పిస్తున్నా దాని తయారీకి భారీ ఫలకాలు, విశాలమైన స్థలం వంటివెన్నో కావాలి. ఈ సమస్యలకు కూడా చెక్ పెడుతూ, సౌర విద్యుదుత్పత్తిని అత్యంత సులభతరం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది.

ఎక్కడికక్కడ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోగలిగే అతి సూక్ష్మ సౌర ప్యానళ్లు త్వరలో రాబోతున్నాయి. వెంట్రుక మందంలో కేవలం వందో వంతు మాత్రమే ఉండే ఈ బుల్లి సౌర ప్యానళ్లను ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సైంటిస్టులు తాజాగా అభివృద్ధి చేశారు. వీటిని ప్రయాణాల్లో వీపుకు తగిలించుకునే బ్యాక్‌ప్యాక్‌పై, సెల్ ఫోన్ వెనక, కార్ రూఫ్ మీద... ఇలా ఎక్కడైనా సులువుగా అమర్చుకోవచ్చు! అంతేకాదు, ప్రస్తుత సౌర ఫలకాల కంటే రెట్టింపు సౌర విద్యుదుత్పాక సామర్థ్యం ఈ బుల్లి ఫలకాల సొంతం!!

ఎలా పని చేస్తుంది?

ఈ బుల్లి ప్యానళ్లలో సోలార్ కోటింగ్‌ను పెరోవ్‌స్కైట్స్‌గా పిలిచే పదార్థంతో తయారు చేస్తారు. ప్రస్తుత సిలికాన్ ఆధారిత సౌర ప్యానళ్లతో పోలిస్తే ఇది సూర్యరశ్మిని మరింత మెరుగ్గా ఒడిసిపడుతుంది. పైగా ప్రస్తుత ప్యానళ్లు అవి ఒడిసిపడుతున్న సూర్యరశ్మిలో 22 శాతాన్ని మాత్రమే ఇంధనంగా మార్చగలుగుతున్నాయి. ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టులు రూపొందించిన బుల్లి ప్యానళ్లు 27 శాతం సామర్థ్యంతో పని చేస్తాయి. దీన్ని మున్ముందు 45 శాతం దాకా పెంచుకోవచ్చని వాళ్లు బల్లగుద్ది చెబుతున్నారు. "తొలిసారి రూపొందించినప్పుడు వీటి కన్వర్షన్ సామర్థ్యం 6 శాతమే. ఐదేళ్లలోనే దాన్ని 27 శాతానికి పెంచగలిగాం" అని వివరించారు. "ఎలా చూసుకున్నా సౌర విద్యుదుత్పత్తి రంగంలోనే ఇది అతి కీలకమైన ముందడుగు. ఎందుకంటే సిలికాన్ ఆధారిత ప్యానళ్లను



బిగించేందుకు ప్రత్యేక సౌర క్షేత్రాలు తప్పనిసరి. అందుకు పంట పొలాలను వాడుతుండటం ప్రపంచవ్యాప్తంగా రైతుల ఆందోళనలు తదితరాలకు దారితీస్తోంది. కానీ పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లకు ఆ అవసరమే ఉండదు. సిలికాన్ ప్యానళ్లతో పోలిస్తే వీటిని ఎక్కడంటే అక్కడ అతి సులువుగా బిగించుకోవచ్చు. కారుచౌకగా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. ఎలాంటి ఉపరితలం మీదైనా ఇవి సులువుగా ఒదిగిపోతాయి. చివరికి ప్లాస్టిక్, కాగితంపై కూడా!" అని పరిశోధనలో పాలుపంచుకున్న ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టు జుంక్ వాంగ్ వివరించారు. "పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లలో కేవలం ఒక మైక్రాన్ మందం కోటింగ్ ఉంటుంది. ప్రస్తుత సౌర ప్యానళ్లలో వాడుతున్న సిలికాన్ కోటింగ్‌తో పోలిస్తే ఇది ఏకంగా 150 రెట్లు పలుచన" అని చెప్పారు.

ఆ సమస్యనూ అధిగమిస్తే...

సంప్రదాయ సిలికాన్ సౌర ప్యానళ్లతో పోలిస్తే బుల్లి ప్యానళ్లలో ఒక పెద్ద సమస్య లేకపోలేదు. అదే... స్థిరత్వం! పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లు ప్రయోగశాల పరిస్థితుల్లోనే కరిగిపోతున్నాయి. లేదా కొద్ది రోజుల్లోనే విరిగిపోతున్నాయి. అయితే ఇది సమస్యేమీ కాదని వాంగ్ అన్నారు. "వాటి జీవితకాలాన్ని పెంచేందుకు జరుగుతున్న పరిశోధనలు కొలిక్కి వస్తున్నాయి' అని వివరించారు.

ఆకాశమే హద్దు...!

ప్రపంచవ్యాప్తంగా సౌర ప్యానళ్ల ఏర్పాటు ఒక్క గత ఏడాదిలోనే ఏకంగా 80 శాతం పెరిగినట్టు స్వచ్ఛ ఇంధన గణాంకాలు, విశ్లేషణలో పేరున్న వుడ్ మెకెంజీ సంస్థ వెల్లడించింది. వాటి ఏర్పాటుకు వెచ్చించాల్సిన ఖర్చు భారీగా తగ్గుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా సౌర విద్యుత్ అతి చౌకైన ఇంధన వనరుగా మారిపోతోంది. అంతేగాక గత 19 ఏళ్లుగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విద్యుత్ వనరుగా నిలుస్తూ వస్తోంది. "ఈ పరిస్థితుల్లో మేం రూపొందించిన బుల్లి సౌర ప్యానళ్లు గనక ఒక్కసారి సక్సెసైతే వీటి వాణిజ్య విలువ ఆకాశాన్నంటుతుంది. అప్పుడిక ప్రపంచ ఇంధన రంగ ముఖచిత్రమే మారిపోవడం ఖాయం" అని పరిశోధక బృందం సారథి హెన్రీ స్నెయిత్ ధీమాగా చెబుతున్నారు!

## తెలంగాణ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్, సెప్టెంబర్‌లో వందల కొత్త ఉద్యోగాలు!



ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జొయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. హైదరాబాద్‌లోని జొయిటిస్ ఇండియా కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్?బాబుతోపాటు అధికారుల బృందంతో, ఈ కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లో తమ జొయిటిస్ ఇండియా కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జొయిటిస్ రంగ ప్రవేశం హైదరాబాద్‌కు మరింత గుర్తింపు తెస్తుందన్నారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందని జొయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ అన్నారు. తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జొయిటిస్ ఇండియా కేపబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడే సేవలందించటంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు. జొయిటిస్ కంపెనీ విస్తరణ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వనరులు, తమ ప్రభుత్వ విధానాలపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించిందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్?బాబు అన్నారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. జొయిటిస్ కంపెనీ దాదాపు 70 సంవత్సరాలుగా జంతువుల అనారోగ్యం, రోగ నిర్ధారణ, నిరోధించే మార్గాలు, చికిత్స సంబంధిత అంశాలపై పనిచేస్తోంది. జంతు సంరక్షణలో భాగంగా పశు వైద్యులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు అండగా నిలుస్తోంది. ఔషధాలతో పాటు వ్యాక్సిన్‌లు, రోగ నిర్ధారణలో కొత్త సాంకేతికత, ఆవిష్కరణలపై దాదాపు వంద దేశాలకు సేవలు అందిస్తోంది.

## 8 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్.. మోడీ సంకల్పానికి సాక్ష్యం..



తెలంగాణ మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై కేంద్ర హెంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలన్న ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పానికి ఈ నిర్ణయం నిదర్శనం. నిన్న ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎనిమిది కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంపై బండి సంజయ్ ఎక్స్ వేదికగా శనివారం స్పందించారు. రూ. 24,657 కోట్ల అంచనా వ్యయంతో, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, జార?ండ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఈ కొత్త రైల్వే లైన్లను ఏర్పాటు చేస్తారు, ఇందులో భాగంగా ఒడిశాలోని మల్కన్‌గిరి నుండి భద్రాచలంలోని పాండురంగాపురం వరకు రూ. 4,109 కోట్లతో 200.60 కి.మీ పొడవున కొత్త లైన్‌ను నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ లైన్ పూర్తి చేసి అందుబాటులోకి వస్తే ఏపీ, తెలంగాణ నుంచి తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు రైల్వే కనెక్టివిటీ పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల చాలా రాష్ట్రాలు లబ్ది పొందుతాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణమ్ తెలిపిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార?ండ్, బీహార్, ఒడిశా, మహారాష్ట్ర సహా పశ్చిమ బెంగాల్‌లోని 7 రాష్ట్రాల్లోని 14 జిల్లాలను కవర్ చేసే 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపిందని రైల్వే మంత్రి అశ్విని వైయం దాదాష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యపు రూ.2కోట్లు. 8 ప్రాజెక్టులలో ఒకటి మల్కన్ గిరి-పాండు4,657 కోట్లు. 8 ప్రాజెక్టులలో ఒకటి మల్కన్ గిరి-పాండురంగాపురం (భద్రాచలం మీదుగా) 173.61 కి.మీ. ఇది తూర్పు గోదావరి, భద్రాద్రి కొత్తగూడెం మరియు మల్కన్‌గిరి (%ూ్రా%, తెలంగాణ, ఒడిశా) జిల్లాలను కవర్ చేస్తుంది.

## అక్కడ అన్నా క్యాంటీన్ల ప్రారంభం ఆలస్యం కారణమిదే..!



ఏపీలో టీడీపీ బ్రాండ్ అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కోసం ప్రయత్నాలు శరవేగంగా సాగుతున్నాయి. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో తొలి విడతగా 100 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ కోసం ఎన్డీయే సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో రెండో దశలో ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా విశాఖ జిల్లాలో మాత్రం ఈ క్యాంటీన్ల పునరుద్ధరణ వాయిదా పడుతోంది. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కానీ ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆటంకంగా మారింది. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదలయ్యాయి. ఈ నెల 13వరకు నామినేషన్ల స్వీకరణ చేయనున్నారు. ఈనెల 30న పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. దీంతో అప్పటివరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. కాబట్టి అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ ఇక్కడ సాధ్యం కావడం లేదు. జీవీఎంసీ పరిధిలోనే పునరుద్ధరించాల్సిన అన్నా క్యాంటీన్లు 24 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ఈ నేపథ్యంలో వీటిని పునరుద్ధరించడంతో పాటు కొత్తగా ప్రారంభించాల్సిన క్యాంటీన్లపై మున్సిపల్ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం కానున్నప్పటికీ ఆ తర్వాత రెండో దశలో మాత్రం వీటిని కచ్చితంగా ప్రారంభించనున్నారు.

## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం.. సాగునీటి ప్రాజెక్టుల పేర్ల పునరుద్ధరణ

ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 12 సాగునీటి ప్రాజెక్టుల పేర్లను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అనేక నీటిపారుదల పథకాలు, ప్రాజెక్టుల పేరు మారనున్నాయి. ముఖ్యంగా గత వైఎస్సార్ పార్టీ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, వైసీపీ నేతల పేర్లను సాగునీటి ప్రాజెక్టులకు పెట్టింది. అయితే గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న పేర్లనే పునరుద్ధరిస్తున్నట్టు తెలిపింది. వైఎస్ఆర్ పల్నాడు కరవు నివారణ ప్రాజెక్టును గోదావరి పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టుగా, వైఎస్ఆర్ వేదాద్రి ఎత్తిపోతలను ముక్త్యాల ఎత్తిపోతలుగా మార్చింది. అనంత వెంకట రెడ్డి హంద్రీ నీవా సుజల స్రవంతి ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను హంద్రీ నీవా సుజల స్రవంతి ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా పునరుద్ధరించనున్నారు. అలాగే వరికపూడిశెల, సంగం బ్యారేజీ, తాటిపూడి రిజర్వాయర్ పేర్లనూ పునరుద్ధరించింది.

# ప్రజాస్వామ్య లోటుతో బంగ్లా ప్రళయం




జూలై 4, 1776న పదమూడు అమెరికా రాష్ట్రాలు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. ఫ్రెంచ్ విప్లవం సంభవించి రెండు శతాబ్దాలకు పైగా గడిచిపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి స్వేచ్ఛ పొందిన తొలి వలస రాజ్యం ఆస్ట్రేలియా (1901లో). భారత్ 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నది. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ఇప్పటికీ స్వతంత్ర, ప్రజాస్వామిక దేశాలుగా వర్ధిల్లుతున్నాయి. వలస పాలనా శక్తుల (బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, పోర్చుగల్ మొదలైనవి) నుంచి విముక్తి పొందిన దేశాలన్నీ చిరకాలం నిజంగా 'స్వతంత్ర' దేశాలుగా లేవు. పలు దేశాల పౌరులు అందరూ పౌర స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పూర్తిగా నోచుకోవడం లేదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షికమైన ఎన్నికలలో తాము కోరుకుంటున్న వారిని ఎన్నుకోలేని దుస్థితి నెదుర్కొంటున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచ జనాభాలో కేవలం 20 శాతం మంది మాత్రమే నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందుతున్నారు. ప్రజాస్వామిక హక్కులను అనుభవిస్తున్నారు. ఆ అదృష్ట భాగ్య దేశాలలో భారత్ కూడా ఉన్నది. ఇది మనకు సంతోషకరమేకాదు, గర్వకారణం కూడా. ప్రజాస్వామ్యం ఒకరు ఇచ్చేది కాదు. మరొకరి నుంచి స్వీకరించేదీ కాదు. ఆగస్టు 14, 1947న పాకిస్థాన్ స్వతంత్ర దేశంగా ప్రభవించింది. అయితే అనేకమార్లు సైనిక నియంతృత్వ పాలనలోకి వెళ్లింది. మన మరో పొరుగు దేశం (తొలుత పాకిస్థాన్‌లో ఒక రాష్ట్రంగా ఉన్న) బంగ్లాదేశ్ పాకిస్థాన్‌ను ఏలిన సైనిక ప్రభుత్వాల పద ఘట్టనలో దశాబ్దాల పాటు నలిగిపోయింది. సైనిక పాలకులపై తిరుగుబాటుగా గెరిల్లా ఉద్యమం ఆరంభమయింది. క్రమేణా బలోపేతమై విముక్తి పోరాటంగా పరిణమించింది. భారత్ జోక్యంతో 1971లో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. 1975-91 సంవత్సరాల మధ్య పలువురు సైనిక పాలకులు వచ్చారు, పోయారు. ప్రధాన రాజకీయ పక్షాలు అవామీ లీగ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) కలసికట్టుగా సైనిక పాలకులను వ్యతిరేకించాయి. ప్రజాస్వామ్యం కోసం పోరాడాయి. 1991లో పౌర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అవామీ లీగ్ అధినేత్రి బేగం షేక్ హసీనా ప్రధానమంత్రిగా 1996లో ప్రప్రథమంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2008, 2014, 2019, 2024లో ఆమె ప్రధానమంత్రిగా ఎన్నికవుతూ వచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఎన్నికలను ప్రతిపక్షాలు బాయ్‌కాట్ చేశాయి. షేక్ హసీనా నేతృత్వంలో బంగ్లాదేశ్ గణనీయమైన ఆర్థిక పురోగతిని సాధించింది. బంగ్లా తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే అధికం. శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్ మొదలైన ఇతర దక్షిణాసియా దేశాల కంటే కూడా బంగ్లాదేశ్ ముందంజ వేసింది. మానవాభివృద్ధి సూచీలో బంగ్లాదేశ్, శ్రీలంక తరువాయి స్థానంలో ఉన్నదిబీ భారత్, నేపాల్, పాకిస్థాన్ కంటే ఉన్నత స్థాయిలో ఉన్నది. బంగ్లాదేశ్‌లో శిశు మరణాల రేటు భారత్‌లో కంటే తక్కువగా నమోదవుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికల నిర్వహణలో ఢాకా పాలకుల వ్యవహార శైలిని ఫ్రీడమ్ హౌజ్ నివేదిక తూర్పార బట్టింది. అలాగే పత్రికా స్వాతంత్ర్యం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో కూడా బంగ్లా పాలకుల తీరు తెన్నులు అంతర్జాతీయ సంస్థల ఆమోదాన్ని పొందలేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలను అదుపు చేస్తే లేదా నిరుద్యోగిత, అసమానతలు, వివక్షలపై ప్రజల అసంతృప్తి తగ్గితేనే ఆర్థికాభివృద్ధి సుసాధ్యమవుతుందని పాలకులు భావించడం కద్దు. అయితే ఇది చాలా చాలా అరుదుగా మాత్రమే నిజం. బంగ్లాదేశ్‌లో పాలకుల పట్ల ప్రజల వ్యతిరేకత మహోధృతంగా వెల్లువయింది. ప్రభుత్వోద్యోగాలలో వివక్షాపూరిత, ఆశ్రిత పక్షపాత రిజర్వేషన్ల విధానంతో విద్యార్థిలోకం ఆగ్రహావేశాలకు అవధులు లేకపోయాయి. ప్రజాస్వామ్య ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లాయి. ఇదిలా వుండగా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల మందగించింది. ధరలు పెరిగాయి. ఉద్యోగాలు మృగ్యమయ్యాయి. పరిస్థితులు విషమిస్తున్నాయన్న వాస్తవాన్ని షేక్ హసీనా గుర్తించలేదు. గుర్తించినా నిరాకరిస్తూ వచ్చింది. ఇది నియంతలు అందరూ చేసే తప్పే. రిజర్వేషన్ల విధానం ఆందోళనాగ్నులకు ఆజ్యం పోసింది. అవినీతి, పోలీసు క్రౌర్యాలు, న్యాయవ్యవస్థ ఉదాసీనత మొదలైనవి కూడా బంగ్లా ప్రజల ఆందోళనను మరింత తీవ్రం చేశాయి. పర్యవసానాలు సుపరిచితమైన కథే కదా. సకల జనులు వీధుల్లోకి వచ్చారు. పోటెత్తారు. పోరాటాల వెల్లువలకు అడ్డు లేకపోయింది. ఇటువంటి పరిణామాలు ప్రభుత్వాలను కూల్చివేయడం సహజమే. ప్రజలు పూర్తిగా ఆశాభావాన్ని కోల్పోయినప్పుడే సామూహికోద్యమాలు ప్రజ్వరిల్లుతాయి. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసే మార్గం పూర్తిగా మూసుకుపోయినప్పుడు ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి అంతు ఉండదు. ప్రజాందోళనలు ఒకసారి ప్రారంభమయితే అందులో సామాన్య ప్రజలు మాత్రమే ఉండరు. తీవ్రవాద శక్తులు ఉగ్రవాద బృందాలు కూడా పాల్గొంటాయి బంగ్లాదేశ్‌లో ఇదే జరిగింది. వివిధ సంస్థలు, పలువురు వ్యక్తులు ఈ వాస్తవాన్ని ధ్రువీకరించారు. విదేశీ జాతీయులు, మైనారిటీ వర్గాలు ఉద్యమ తీవ్రతను చవిచూడడం అనివార్యమవుతుంది. అల్పసంఖ్యాక వర్గాల గృహాలపై దాడులు జరుగుతాయి. వారి వ్యాపార సంస్థలు, ఆరాధనా మందిరాలను ధ్వంసం చేస్తారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అందుకు భిన్నమైనవి కావు. చాలా దేశాలలో అటువంటి ఉపద్రవాలలో మైనారిటీలు తీవ్ర ఇక్కట్లనే ఎదుర్కొన్నారు. కారణమేమిటి? ప్రజాస్వామ్య లోటు. దానివల్లే ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం అనివార్యమవుతుంది. పరిష్కారమేమిటి? ప్రజాస్వామ్య లోటును పూరించడమే. ప్రజాస్వామ్య లోటును పూరించడమనే కళలో అమెరికా, బ్రిటన్‌లు దాదాపుగా సమగ్ర ప్రావీణ్యాన్ని, పరిణతిని సాధించాయి. పార్టీలోను, పార్లమెంటులోను, ప్రజలలోను అసంతృప్తి తీవ్రమయినప్పుడు బ్రిటిష్ ప్రధానమంత్రులు థాచర్, జాన్సన్, మే స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలిగి కొత్త నాయకుడిని ఎన్నుకొనే అవకాశాన్ని తమ పార్టీకి కల్పించారు. అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్, జో బైడెన్‌లు అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేసేందుకు నిరాకరించారు. జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసి ప్రభుత్వాధినేతల రాజీనామాలు సాధించవచ్చు. పదవీకాల పరిమితులు కూడా చాలా ఉపయోగపడతాయి. పత్రికా స్వేచ్ఛ సంపూర్ణంగా ఉంటే పరిస్థితులను చక్కదిద్దడం మరింత తేలికవుతుంది సుప్రీంకోర్టు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య కాపలాదారుగా వ్యవహరించడం వల్ల చాలా మేలు జరుగుతుంది. స్వతంత్ర ఎన్నికల సంఘం ప్రతి ఐదేళ్లకు ఒకసారి విధిగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించడం వల్ల పేదలు, అణగారిన వర్గాలవారు, నిర్లక్ష్యానికి గురవుతున్న వారికి ఎంతైనా ఉపశమనం కలుగుతుంది. పార్లమెంటు ప్రతి నెలా విధిగా సమావేశమవుతూ సభాపతి అనవసర జోక్యం లేకుండా ప్రతి రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాద ప్రతివాదనలు అనుమతించడమే ప్రజాస్వామ్య లోటుకు అంతిమ సమాధానమని నేను భావిస్తున్నాను. ప్రజాస్వామ్య లోటుకు బంగ్లాదేశ్ భారీ మూల్యాన్ని చెల్లించింది. ప్రజా ప్రళయాగ్నులలో ఆహుతి అయిన వారి కోసం నేను దుఃఖిస్తున్నాను.

# మన కోచింగ్ సెంటర్లపైనా ఓ కన్నేసి ఉంచాలి!




భారీ వర్షాల కారణంగా మురుగు కాలువ పొంగిపొర్లి ఢిల్లీలో ఒక సివిల్ సర్వీస్ శిక్షణా సంస్థలో బేస్‌మెంట్ లైబ్రరీలోకి వరద నీరు ఉధృతంగా ప్రవహించిన దుర్ఘటనలో ముగ్గురు విద్యార్థులు జల సమాధి కావటం యావత్ దేశాన్ని కలిచివేసింది. చనిపోయిన ముగ్గురిలో ఒకరైన తానియా సోనీ తండ్రి మంచిర్యాల సింగరేణిలో సీనియర్ మేనేజర్ కావడంతో తెలంగాణ అంశం తెరపైకి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తానియా సోనీ మృతదేహాన్ని తరలించడంలో తండ్రి విజయ్ కుమార్‌కి సహాయ సహకారాలు అందించాల్సిందిగా ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కి ఆదేశాలు జారీ చేశారు. మన తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అనుమతి లేని పలు కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడు ఈ కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు వరంగల్ మరియు ఇతర జిల్లా కేంద్రాలకు కూడా విస్తరించాయి. హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్ల మూలంగా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్‌లు నిరుద్యోగుల కూడళ్ళుగా పేరుపొందాయి. అడ్డు అదుపులేని కోచింగ్ సెంటర్లపై మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ యూపీఏ ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. కోచింగ్ సెంటర్లను సేవారంగంలోకి తెచ్చి వాటిపై పన్నులు వేశారు. 18 జనవరి 2024న భారత ప్రభుత్వం కోచింగ్ సెంటర్ల నియంత్రణ కోసం విద్యా మంత్రిత్వశాఖ ద్వారా కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలు ఎక్కడా అమలు కావడం లేదు. మన రాష్ట్రంలో హైదరాబాద్ అశోక్‌నగర్‌లో గ్రూప్ 1, 2, 3, సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్లు ఎక్కువగా ఉండగా దిల్‌సుఖ్‌నగర్‌లో డీఎస్సీ, ఎస్సై/ కానిస్టేబుల్, గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్‌టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ , స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ , బ్యాంకింగ్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఫర్ అడ్మిషన్స్ ఇన్ ఎంబీఏ సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ వంటి శిక్షణను ఢిల్లీకి చెందిన అనేక శిక్షణా సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా దిల్‌సుఖ్‌నగర్‌లోను, ఇతర ప్రాంతాల్లోను నిర్వహిస్తున్నాయి. ఇక అమీర్‌పేట్‌లో కేవలం సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లతోపాటు టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్, ప్రపంచవ్యాప్త బిజినెస్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్స్ కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధిక కోచింగ్ సెంటర్లకు ఎటువంటి అనుమతులు ఉండవు. కేవలం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నామమాత్రపు రుసుముతో ఒక వ్యాపార సంస్థగా నమోదు చేసుకుంటారు. కోచింగ్ సెంటర్లు నడుపుతున్న భవనాలకి భవన యజమానులు అగ్నిమాపక శాఖ విధించిన రక్షణ నిబంధనలు పాటించరు. గృహ అవసరాలకు అని ముందుగా విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకుని ఆ భవనాలను కోచింగ్ సెంటర్‌లు నడుపుకోవటానికి వాడుకుంటూ విద్యుత్ శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. తనిఖీకి వచ్చిన జీహెచ్‌ఎంసి, విద్యుత్ శాఖ అధికారుల జేబులు నింపుతూ జరిమానాల నుంచి తప్పించుకుంటున్నారు. ఆ శిక్షణా సంస్థల్లో ఎంతమంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు, వారు ఎంతెంత ఫీజులు చెల్లిస్తున్నారు అనేటువంటి లెక్కల పత్రాలు ఉండవు. తరగతి గదిలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి పైన జీఎస్టీ వంటి పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారు. జీతాలు లేదా ప్యాకేజీలు ఇచ్చే బోధనా సిబ్బంది నుంచి టీడీఎస్ (టాక్స్ డిటెక్టెడ్ సర్వీస్) చెల్లించరు. ఇరుకుగా వెలుతురు లేని గదుల్లో 100 మంది కూర్చోవాల్సిన చోట సుమారు 500మందిని కూర్చోబెట్టి బోధిస్తున్నారు. వందలాదిమంది విద్యార్థులకు ఒకటి రెండు అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉంచి విద్యార్థి, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలకి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే సుమారు 13 ఎస్సీ ఎస్టీ బీసీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. వాటిలో ఎస్సై, కానిస్టేబుల్, డీఎస్సీ, గ్రూప్స్, సివిల్స్ సర్వీసెస్ వంటి శిక్షణ లభిస్తుంది. ప్రభుత్వ స్టడీ సర్కిళ్లలో ప్రవేశాల కోసం పోటీ పరీక్ష పెట్టి ప్రతిభ ఆధారంగా పరిమితమైన సీట్లలో నిరుద్యోగులను చేర్చుకొని శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ స్టడీ సర్కిళ్లలో సీటు రానివాళ్లు ఇష్టం లేకున్నా ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కన్నా ఆదాయం తక్కువగా ఉన్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ఉత్తీర్ణులై సివిల్స్ మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులకు రాజీవ్‌గాంధీ సివిల్ అభయహస్తం పేరుతో సింగరేణి సంస్థ ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయడాన్ని ఈ సందర్భంగా మనమంతా అభినందించాలి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో సివిల్ సర్వీసెస్, ప్రిలిమ్స్ మెయిన్స్‌కి రూ.1,50,000వేలుబీ గ్రూప్ వన్ ప్రిలిమ్స్ మెయిన్స్‌కి రూ.1,00,000బీ గ్రూప్ 2, గ్రూప్ 3కి రూ.22 వేలుబీ డీఎస్సీకి రూ.20వేలుబీ ఎస్సై కానిస్టేబుల్ కోచింగ్‌కి రూ.20 వేలుబీ ఐఐటి, నీట్, ఎంసెట్, కోచింగ్‌లకు రూ.2లక్షల 50వేలు, ఇతర కోచింగ్‌లైన గేట్, క్యాట్, టోఫెల్, జీఆర్ఈల ఫీజు సుమారు ఒక లక్ష వరకు ఉంటుంది. అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్న కొన్ని కోచింగ్ సెంటర్లను నియంత్రించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికి ఉంది. వీటి నియంత్రణకు అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చి తల్లిదండ్రులపై ఫీజుల భారం పడకుండా విద్యార్థి నిరుద్యోగుల శ్రేయస్సుకు పాటుపడాలి.




# రైతుకు పట్టం కట్టిన ప్రభుత్వం



వ్యవసాయ కుటుంబంలో పుట్టి, వ్యవసాయ రంగ సాధక బాధకాలను అనుభవంతో తెలుసుకున్న వ్యక్తిత్వంతో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. తెలంగాణ సామాజిక వ్యవస్థ నిర్మాణం, భౌగోళిక వాతావరణంపై అవగాహన కలిగిన రేవంత్‌రెడ్డి రైతుకు లబ్ధి చేకూరేవిధంగా ప్రభుత్వ విధివిధానాలను రూపొందించారు. వాటికి అనువుగానే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జూలై 25న రూ.2,91,191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకి పెద్దపీట వేశారు. కుటుంబ సభ్యులంతా శ్రమించే చిన్న రైతులు, కుటుంబమంతా శ్రమిస్తూ ఉన్నా చాలినంత భూమిలేని సన్నకారు రైతుల చేతిలో 87శాతం సాగు భూమి ఉంది. వీరికి వ్యవసాయం ఒక పండగ అయ్యేలా ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో అనేక ఉద్దీపనలను ఇచ్చింది. 2030 వరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. ఈ లక్ష్యాలలో పేదరికాన్ని, ఆకలిని రూపుమాపటం, చక్కటి ఆరోగ్య జీవనం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం సాధన వంటివి అగ్రశ్రేణి లక్ష్యాలు. వీటిలో మొదటి రెండు లక్ష్యాల సాధనకు వ్యవసాయ రంగ అభివృద్ధి కీలకం. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు రూ.26,831 కోట్లను కేటాయించారు. సాగు నీటికి రూ.26,885 కోట్లను కేటాయించారు. మూడో ప్రపంచ దేశాలకు అభివృద్ధికి దిక్సూచీగా, ప్రేరణగా నిలిచే రైతు భరోసా పథకంతోపాటు, ఆపదలో ఆదుకోవ డానికి రైతు బీమా పథకం, విప్లవాత్మక రుణమాఫీతో రైతు హృదయ దివిటీగా చరిత్రలో ప్రత్యేక స్థానం పొందారు రేవంత్‌రెడ్డి. ల్యాబ్ టు ల్యాండ్ వెలుగులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో రైతు వేదికలను అనుసంధానించారు. జీవవైవిద్యంతో కూడిన పంటల సాగుకు, విత్తనోత్పత్తికి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దనున్నారు. గత పదేళ్ళ పాలనలో జరిగిన మంచిని, అభివృద్ధిని, లోపాలను, వైఫల్యాలను సాపేక్ష దృష్టితో సమీక్షించి మరిన్ని జనహిత పథకాల రూపకల్పన చేస్తున్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో మూడవది అన్ని వయసుల వారికీ ఆరోగ్యకరమైన జీవనం. తెలంగాణాలోని ఐదు వేలకు పైగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో భారత ప్రజారోగ్య ప్రమాణాల సంస్థ నిర్దేశించిన నిబంధనల వెలుగులో సదుపాయాలను కల్పించారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.11,468కోట్లు కేటాయించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచారు. విద్యా వైద్య సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను పెంచారు. టీచింగ్ స్టాఫ్ నియామకాలు చేపడుతున్నారు. సుస్థిరాభివృద్ధి నాలుగవ లక్ష్యమైన నాణ్యతగల విద్యను అందించడం కోసం ఈ బడ్జెట్‌లో రూ. 21,389 కోట్ల నిధులను కేటాయించారు. విద్యకు ప్రాతిపదిక సూచీలైన 7ి14 ఏండ్ల మధ్య అక్షరాస్యతలో 90.56 శాతాన్ని, 15-24 ఏండ్ల మధ్య 86.97 శాతాన్ని సాధించి, జాతీయ సగటు కంటే ఎక్కువగా తెలంగాణ సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేస్తున్నారు. సుస్థిరాభివృద్ధి ఐదవ లక్ష్యం లింగ సమానత్వం. ఈ దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళా జన జీవితాలలో అనూహ్య మార్పును తీసుకువచ్చింది. ఉచిత రవాణాతో శ్రామిక రంగంలో మహిళల వాటా పెరిగింది. ఉచిత రవాణకు రూ.723 కోట్ల నిధులను ఇచ్చారు. గృహజ్యోతి, సబ్సిడీ సిలెండర్‌లతో మహిళా జీవితాలలో వెలుగును నిండింది. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖకు రూ.2,736 కోట్ల నిధులను ఇచ్చారు. అంగన్‌వాడిలలో ప్రీప్రైమరీ తరగతులకు రూపకల్పన చేసారు. తెలంగాణా జనాభాలో వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, మతపరమైన మైనారిటీలు 85శాతం ఉన్నారు. ఈ వర్గాల ఉన్నతి కోసం సామాజిక సమతుల్యత కోసం బడ్జెట్‌లో రూ.33వేల కోట్లు ఇచ్చారు. చారిత్రక నగరి హైదరాబాద్ అభివృద్ధి కోసం పలు రూపాలలో పలు పథకాలకు రూ.18 వేల కోట్ల నిధులు ఇచ్చారు. విపత్తుల నష్టనివారణ కోసం 'హైడ్రా' సంస్థను ఏర్పాటు చేసారు. మున్సిపాలిటీల కోసం రూ.15,594కోట్లు కేటాయించారు. ప్రజా ఎజెండాయే తన ఆత్మగా భావిస్తూ, జాతీయోద్యమ, నవ భారతాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ తాత్వికతను నింపుకుని, రేవంత్‌రెడ్డి తెలంగాణకు సుపరిపాలను అంది?స్తున్నారు. భారత ప్రథమ ప్రధాని నెహ్రూ ఆగస్ట్ 15, 1947నాడు ఎర్రకోట మీద చేసిన చారిత్రాత్మక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'లో "దేశానికి, సమాజానికి సేవ చేయడమంటే పేదరికం, అజ్ఞానం, అనారోగ్యం, అవకాశాలలో అసమానతను అంతం చేయడమే" అన్నారు. ఈ వారసత్వ కొనసాగింపునకు ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుంది.